సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 4-4-2025 15/-

# మొక్కవోని స్థైర్యం



## ఆర్థిక న్యాయానికి ఆలంబన

ZAKAT CENTER INDIA



రచయితలకు, పాఠకులకు,
ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
ఈదుల్ ఫిత్ర్
శుభాకాంక్షలు

సహజీవన భావాల పొదరింట
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 14 హైదరాబాద్
శుక్రవారం 4 ఏప్రిల్ 2025 రూ.15-00
5 షవ్వాల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**మనిషి పరలోకంలో సత్ఫలితం పొందే ఉద్దేశ్యంతో తన ఇంటి వారిపై ఖర్చు చేస్తే, అది అతని 'సదఖా' గానే పరిగణించబడుతుంది.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com


## రమజాన్ స్ఫూర్తి కొనసాగాలి

16



## లోపల...


| | | |
|---|---|---|
| సింహావలోకనం | ...... | 04 |
| మొక్కవోని స్థయిర్యం | ...... | 05 |
| ఆర్థిక న్యాయానికి ఆలంబన | ...... | 08 |
| గాజా – ఓ గాజా ! (కవిత) | ...... | 11 |
| ఈద్ ముబారక్ | ...... | 12 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఈజిప్ట్ పరిస్థితుల నుండి గుణపాఠం – 1 | ...... | 20 |
| చరితార్థులు–2 : అబ్దుర్ రహ్మాన్ రేయా | ...... | 23 |
| కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం! – 2 | ...... | 24 |
| తెలుగు భాషలో ఖుర్‌ఆన్ అనువాదాలు | ...... | 27 |
| ఉగ్రదాడి కన్నా భయంకరమైనది డ్రగ్స్ | ...... | 28 |
| షవ్వాల్ ఉపవాసాలు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


### స్ఫూర్తి కొనసాగాలి



ముచ్చటగా ముగిసింది
మహిమాన్విత మాసం
విశ్వాసుల మోముపైన
మెరిసిందిలే దరహాసం!
మిగిలిన కాలమంతా
మంచితోనె సహవాసం
అలవర్చుకున్న శిక్షణ
కాకూడదు పరిహాసం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# సింహావలోకనం

**నెల రోజుల** ఉపవాసాలు, ఆరాధనలు, నెల రోజుల ఆధ్యాత్మిక వాతావరణం ముగిసింది. ఈ నెల రోజుల రమజాన్ శిక్షణ, ముప్పయి రోజుల ఆధ్యాత్మిక సాధన మనలో ఎలాంటి మార్పు తీసుకువచ్చిందో సింహావలోకనం చేసుకోవలసిన సమయం ఇది. మనలో నిగ్రహం, సంయమనం ఎంత పెంచిందో లెక్క చూసుకోవలసిన సమయం ఇది.

ప్రవిత ఖుర్‌ఆన్ అవతరించిన రమజాను నెలలో ఉపవాసాల ద్వారా సాధించాలనుకున్న అసలు లక్ష్యం దైవం పట్ల భయ భక్తులు. ఇందులో ఎంత వరకు కృతకృత్యులమయ్యామో చూసుకోవాలి.

మానవ నైజాన్ని, మానవ స్వభావంలో ఉన్న ప్రాథమిక సవాళ్లను అర్థం చేసుకోవడం ప్రతి మనిషికి చాలా అవసరం. మనిషి కేవలం భౌతిక శరీరం మాత్రమే కాదు, మనిషిలో ఆత్మ ఉంది. మనిషి వ్యక్తిత్వం ఈ ఆత్మయే. ఆత్మప్రక్షాళనకు ఉపయోగపడే ఉపవాసం, ఈ నెలరోజుల తర్వాత మనలో ఎలాంటి మార్పు తీసుకువచ్చింది? మన నడవడిలో, మన మాటతీరులో, మన వ్యవహారశైలిలో ఎలాంటి మార్పులకు కారణమయ్యిందో సమీక్షించుకోవాలి.

**“పవిత్ర ఖురాన్ అవతరించిన నెల రమజాన్ నెల. మానవులంద రికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యా లను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇక నుండి రమజాను నెలను పొందే వ్యక్తి విధిగా ఉపవాసం ఉండాలి”.** *(దివ్య ఖుర్‌ఆన్ 2:185)*

ఉపవాసాన్ని అల్లాహ్ విధిగా చేసాడు, తప్పనిసరి అని ఆదేశిం చాడు. కాబట్టి ప్రతి ముస్లిం ఉపవాసం పాటిస్తున్నాడు. సృష్టికర్త పట్ల విధేయత, తూ.చా. తప్పని ఆజ్ఞాపాలన ఇందులో ఉంది. ఉపవాసం వల్ల లభించే ఇతర ప్రయోజనాలేమైనా గాని అవేవీ ముఖ్యం కాదు, దైవాదేశాలను పాటించడమే అతి ముఖ్యమైన అంశం. అదే దైవం పట్ల భయభక్తులకు నిదర్శనం

ఉపవాసం అనేక రోగాల నుండి కాపాడుతుంది. భౌతిక (physical), మానసిక (mental), మనోవైజ్ఞానిక (psychological), ఆధ్యాత్మిక (spiritual) పరమైన లాభాలెన్నో ఉపవాసం వల్ల లభిస్తాయి. రక్తపోటు నియంత్రణకు కూడా ఉపవాసం సహకరిస్తుందని కొందరంటారు. ఉపవాసం ఉండడం వల్ల అల్జిమర్స్, పార్కిన్సన్ వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గుతాయని, ఉపవాసం క్యాన్సర్‌ను తగ్గించేందుకు ఒక చక్కటి మార్గమని, కిమోథెరఫి వల్ల కలిగే లాభాలను పెంచుతుందని నిపుణులు అంటున్నారు. డయాబెటిస్ విషయంలోను ఉపవాసం గురించి సైంటిఫిక్ రివ్యూలున్నాయి. ఎలర్జీల వల్ల వచ్చే కీళ్లవాపులను (ARTHRITIS) కూడా ఉపవాసం తగ్గిస్తుందని తెలుస్తోంది. ఉపవాసం వల్ల endorphins (దీనిని హ్యాపీ హార్మోన్ అని కూడా అంటారు) విడుదల అవుతుంది. అందువల్ల stress తగ్గుతుంది. డిప్రెషన్‌ను దూరం చేస్తుంది. మానసికారోగ్యానికి ఉపయోగపడుతుంది. హైపర్ గ్లైసెమియాను నియంత్రిస్తుంది. ఉపవాసం త్వరగా వృద్ధాప్యం రాకుండా ఉండటానికి కూడా దోహదపడుతుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. చర్మ సౌంద ర్యాన్ని పెంచుతుంది. ఉపవాసంవల్ల మన కాగ్నిటివ్ పని తీరుకు శక్తి లభిస్తుంది. ఇలా ఉపవాసాల ఆరోగ్య ప్రయోజనాలు చాలా చాలా మన ముందుకు వస్తూనే ఉన్నాయి. ఇవన్నీ దైవం తన కారుణ్యంతో ప్రసాదిస్తున్న అదనపు ప్రయోజనాలు మాత్రమే. అసలు లక్ష్యం దైవం పట్ల భయభక్తులు. ఆగి పొమ్మంటే ఆగి పోవడం.

ధర్మం అంటే మానవత్వానికి మారుపేరు. మనిషిలో సానుభూతి, సహనం, వినమ్రత, పరోపకారం, దయ, జాలి వంటి గుణ గణాలు పెంపొందాలంటే దైవం పట్ల భయభక్తులున్నప్పుడే సాధ్యం. ఈ భయభక్తులను పెంపొందించే ఉపవాసం నిజానికి అత్యుత్తమ గుణగణాలున్న వ్యక్తుల మంచి సమాజాన్ని నిర్మించే సాధనం. అందులో సంపన్నులకు కూడా ఆకలి బాధ తెలుసు. పేదలను ఆదుకోడానికి ముందుకు వస్తారు. దైవప్రసన్నతే లక్ష్యంగా జీవిస్తారు.

ఈ రమజాను మాసంలో మనం సాధించిందేమిటి? రమజాను లోని క్షణం క్షణం మనం సద్వినియోగించుకున్నామా? ఒక్కసారి లెక్క చూసుకుందాం. ✤

కవరు కథనం

అబ్దుల్ వాహెద్





# మొక్కవోని స్థైర్యం

ఆప్తులను కోల్పోయాం, మా ఇళ్ళు, వ్యాపారాలు, ఉపాధి, మస్జిదులు, దుకాణాలు అన్ని పోయాయి. కాని ...

మా విశ్వాసం మునుపటికన్నా బలంగా ఉంది.

గాజాలో ఏ పాలస్తీనా పిల్లోడిని అడిగినా ఈ మాటే చెబుతాడు.

ఈ రమజాన్ మాసం గాజాలో విధ్వంసానికి సాక్షిగా మారింది. మిగిలిన ప్రపంచమంతా రమజాన్ శుభాలను అందుకునే ప్రయత్నాల్లో ఉంటే, గాజా ప్రజలు రమజాన్ కారుణ్యాన్ని బాంబుదాడుల్లో వెదుక్కున్నారు. కాల్పుల విరమణ తమాషా కూడా ప్రపంచం చూసింది. కాల్పుల విరమణను భంగపరిచిన పాపి ఎవరో, ఈ యుద్ధాన్ని మారణహోమంలా జరుపుతున్న నీచుడెవరో కూడా ప్రపంచానికి తెలుసు. కాని ఈ ప్రపంచం అనడానికి నోరు లేని ప్రపంచం. అయినా రమజాన్ మాసాన్ని యుద్ధ బీభత్సంలో జరుపుకోవడం గాజాకు, పాలస్తీనా ప్రజలకు అలవాటే. గతంలో 2014లో జరిగిందిదే. ఒకవైపు వైమానిక దాడులు, బాంబు ప్రేలుళ్ళ మధ్య అప్పట్లో రమజాన్ జరుపుకున్న గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. అప్పట్లోను, ఇప్పుడు కూడా గాజా ప్రజలకు రమజాన్ ఉపవాసాల్లో 24 గంటల ఉపవాసాలైపోయాయి. తినడానికి ఒక్కపూట దొరకడం కూడా కష్టంగా మారింది. కరంటు లేదు. కేవలం గుప్పెడు గింజలతో ఉపవాస విరమణ, ఒకరి ముఖం మరొకరు చూడ్డానికి కూడా వీలుపడని చీకటిలో బిక్కుబిక్కుమంటూ పిల్లలు. ఇది నాగరిక ప్రపంచం తమాషా చూస్తున్న గాజా పరిస్థితి. మస్జిదులో అజాన్ విని ఉపవాసం ప్రారంభించడం, ఉపవాసం విరమించడానికి అజాన్ కోసం వేచి చూడ్డం ఇది సాధారణంగా రమజాన్‌లో ఎవరైనా చేసే పని. కాని గాజా పరిస్థితి వేరు, బాంబు పేలుళ్ళ ధ్వనులు, వైమానిక దాడుల ధ్వనుల మధ్య ఉపవాసం. ఇస్రాయీల్ అమానుష నరమేధంలో దాదాపు 50వేల మంది మరణించారు. మరణించినవారంతా అమాయక పౌరులే. అందు

లోను మహిళలు, పిల్లలే ఉన్నారు.

గాజాలో నాసిర్ ఆసుపత్రిపై బాంబులేసి ధ్వంసం చేసింది ఇస్రాయీల్. అంతకు ముందు కూడా అనేక ఆసుపత్రులపై దాడులు చేసి కూల్చేసింది. నాసిర్ ఆసుపత్రి దాడిలో అక్కడి సిబ్బంది, చికిత్స పొందుతున్న రోగులు మరణించారు. ప్రపంచం తమాషా చూసింది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు తమాషా చూస్తున్నాయి. ఎందుకు నాసిర్ ఆసుపత్రిపై దాడి చేసిందంటే, ఆ ఆసుపత్రిలో హమాస్ రాజకీయ నాయకుడు వైద్యం చేయించుకుంటున్నాడని తెలిసిందంట. అతన్ని చంప డానికి ఆసుపత్రిపై బాంబులేసిందంట. ఈ పైశాచిక సమర్థిం పును పాశ్చాత్యదేశాలు విని తలూపాయి. అంటే హమాస్‌కు సంబంధించిన వారెవరైనా ఏ ఆసుపత్రిలో అయినా చికిత్స పొందుతుంటే ఇస్రాయీల్‌కు ఆ ఆసుపత్రిని ధ్వంసం చేసి అక్కడ రోగులను విచక్షణ లేకుండా చంపేసే హక్కు ఉందా? ఈ విధంగా గాజాలో మొత్తం ప్రజారోగ్య వ్యవస్థను నాశనం చేసే హక్కు ఉందా?

ఇస్లామ్ లో కొన్ని ఖచ్చితమైన యుద్ధనియమాలున్నాయి. మొదటి ఖలీఫా అబూబక్ర్ (రజి) తన సైన్యానికి స్పష్టంగా ఈ నియమాలను విధించారు. అవేమిటంటే:

పిల్లలను చంపరాదు (ఇస్రాయీల్ ప్రధానంగా చేసే పని ఇదే. పిల్లలను చంపడం)

మహిళలను చంపరాదు (ఇస్రాయీల్ ప్రధానంగా చేసింది ఇదే. గాజాలో మహిళలు పిల్లలనే చంపారు)

వృద్ధులను చంపరాదు (ఇస్రాయీల్ గత ఏడాదిగా యుద్ధంలో చంపింది వృద్ధులు, మహిళలు, పిల్లలనే. హమాస్ బలం ఏ మాత్రం తగ్గలేదని స్వయంగా యూదసైన్యమే చెబుతోంది)

అలాగే ఇస్లామీయ యుద్ధనియమాల ప్రకారం చెట్లను ధ్వంసం చేయరాదు, ముఖ్యంగా పండ్ల చెట్లను కాల్చరాదు, పశువులను (ఆహారం కోసం తప్ప) చంపరాదు, సన్యాసులు, సాధువులకు హాని కలిగించరాదు...

## ఆధునిక యుద్ధనియమాలేమంటున్నాయి?

యుద్ధంలో గాయపడి చికిత్స పొందుతున్న సైనికులపై దాడి చేయరాదు. ముఖ్యంగా శత్రుదేశ రాజకీయ నాయకులైతే ఈ నియమం మరింత కఠినంగా వర్తిస్తుంది. ఇస్రాయీల్‌లో ఆసుపత్రులు గాయపడిన సైనికులకు చికిత్స చేస్తాయి కదా. ఒకవేళ ఇలా చికిత్స చేస్తున్న ఆసుపత్రిపై హమాస్ క్షిపణి దాడి చేస్తే ఏమంటారు? నాసిర్ ఆసుపత్రిలో హమాస్ పోరాట యోధుడు చికిత్స పొందడం లేదు, హమాస్ రాజ కీయ నేత చికిత్స పొందుతుంటే, ఆ రాజకీయ నాయకుడిని చంపే సాకుతో అక్కడి అమాయక రోగులను, సిబ్బందిని ఇస్రాయీల్ చంపింది. ఇది సముచితమని సభ్యప్రపంచం భావిస్తుంటే, ఇటీవల నెతన్యాహు ఒక ఆసుపత్రిలో ప్రొస్టేట్ సర్జరీ చేయించుకున్నాడు. హమాస్ ఆ ఆసుపత్రిపై దాడి చేసినా ఇదే లాజిక్ ప్రకారం సమర్థించవలసి వస్తుంది. పాశ్చాత్య మీడియా ఇలా చేస్తుందా? ముమ్మాటికి చేయదు. ఎందుకంటే, పాశ్చాత్య మీడియా జాత్యాహంకార మీడియా. ఈ మీడియాకు పాలస్తీనా ప్రజలు మనుషుల్లానే కనపడడం లేదు. ఒకప్పుడు ఈ పాశ్చాత్యులు యూదులను మనుషుల్లానే జమకట్టలేదు. జంతువుల్లా చూసేవారు. అప్పట్లో యూదు లను జంతువుల్లా చంపేవాళ్ళు. ఇప్పుడు పాశ్చాత్యులకు ముస్లిములు అలా కనిపిస్తున్నారు. యూదులు తమ గతాన్ని మరిచిపోయి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. కాని ఏదీ శాశ్వతం కాదు.

ఇస్రాయీల్‌లో స్వయంగా నెతన్యాహుపై వ్యతిరేకత తీవ్రంగా పెరుగుతోంది. నెతన్యాహు అవినీతిపై ప్రజలు రోడ్డుపైకి వచ్చి మరీ నిరసన తెలుపుతున్నారు. నిజానికి ఇస్రాయీల్‌లో చాలా మంది సాధారణ ప్రజలు గాజాలో జరుగుతున్న మారణహోమాన్ని, ముఖ్యంగా పిల్లల హత్యాకాండను నిరసిస్తున్నారు. నెతన్యాహు తన అధికారాన్ని కాపాడుకోవడం కోసమే యుద్ధం కొనసాగిస్తున్నాడని, దీనివల్ల హమాస్ వద్ద బంధీలుగా ఉన్నవారు మరణిస్తే తనకు మరింత లాభమని ఆలోచిస్తున్నాడని ఇస్రాయీల్ ప్రజలే ఆరోపిస్తున్నారు.

మరోవైపు నెతన్యాహు అటార్నీ జనరల్‌ను తొలగించాలని ప్రయత్నించడం కూడా ప్రజలకు నచ్చలేదు. అటార్నీ జనరల్ కు మద్దతుగా వీధుల్లోకి వచ్చారు. గమనించవలసిన మరో విషయమేమిటంటే, న్యాయమూర్తుల నియామకంలోను నెతన్యాహు తన జేబులో ఉండే వారిని న్యాయమూర్తులుగా నియమించుకునే ప్రయత్నాలు చేస్తూ వచ్చాడు. ప్రతి నియంత ఇలానే ప్రయత్నిస్తాడు. ఎందుకంటే నియంతలు చట్టానికి భయపడతారు. అందువల్ల న్యాయవ్యవస్థ తమ కనుసన్నల్లో ఉండాలని భావిస్తారు. సంస్థలను తమ అదుపులో నడుపుతుంటారు.

ఇప్పుడు పరిస్థితేమిటంటే, ఒకవైపు గాజాపై, వెస్ట్ బ్యాంకుపై ఇజ్రాయిల్ దాడులు చేస్తుంది. కాని మరోవైపు స్వయంగా ఇజ్రాయిల్‌లో అంతర్యుద్ధం మొదలవుతుందా అనే పరిస్థితి ఉంది. స్వయంగా జెరుసలేం పోస్టు వంటి పత్రికలు అంత ర్యుద్ధం రావచ్చునే సందేహాలు ప్రకటించాయి. ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. పోలీసులు బలప్రయోగంతో వారిని గెంటేస్తున్నారు.

ప్రస్తుతం ఇస్రాయీల్ పరిస్థితి ఏమిటంటే, షేర్ మార్కెట్ కుప్పకూలింది. ఆర్థికవ్యవస్థ నాశనమయ్యింది.

మరోవైపు ఇస్రాయీల్ గాజాలో మారణహోమం కొనసాగిస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫ్రాంచెస్కా లాబానీ నిర్మొహమాటంగా ఇస్రాయీల్ చేస్తున్నది జాతి హననంగా పేర్కొంది. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే నెతన్యాహును కాపాడ్డానికి అని కొందరు విశ్లేషిస్తున్నారు. ఇంగ్లాండు లేబర్ పార్టీ ఎం.పీ. థాంబెర్రీ కూడా ఈ మాట నిర్మొహమాటంగా చెప్పింది. ఇస్రాయీల్ పత్రికలే స్వయంగా ఈ యుద్ధాన్ని ఇస్రాయీల్‌లో ప్రజాస్వామ్యంపై యుద్ధంగా చెబుతున్నాయి. కాల్పుల విరమణ విషయంలో నెతన్యాహుకు ఆసక్తి లేదని ఇస్రాయీల్ ప్రతినిధులే చెబుతున్నారు. నెతన్యాహుకు దండాలు పెడుతూ ట్రంప్ కూడా అడుగులకు మడుగులొత్తుతున్నాడు. కాని హమాస్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ యుద్ధంలో ఇస్రాయీల్ బందీలు మరణిస్తే బాధ్యత ఎవరిది. మరోవైపు హూతీలు ఇస్రాయీల్ పై మిస్సైల్ దాడులు చేస్తున్నారు. కాల్పుల విరమణను నెతన్యాహు భంగ పరిచిన తర్వాత ఇస్రాయీల్‌లో ఉగ్రవాద దాడులు కూడా జరిగాయి.

ఏది ఏమైనా, మధ్యప్రాచ్యంలో మారణహోమం కొనసాగుతూనే ఉంది. రమజాన్ మాసం యుద్ధబీభత్సంలోనే గడిచి పోయింది. తన అధికారం కాపాడుకోడానికి యుద్ధాన్ని కొన సాగిస్తున్న నెతన్యాహు ప్రొస్టేట్ చికిత్స చేయించుకుని ఇంట విశ్రాంతి తీసుకుంటుంటే, ఇస్రాయీల్ సాధారణ ప్రజలు నెతన్యాహుకు వ్యతిరేకంగా వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. యుద్ధమైనా, శాంతి అయినా పరిస్థితు లేమైనా సరే ఉపవాసాలు, నమాజులు, దైవారాధనలు కొనసాగుతూనే ఉంటాయని గాజా ప్రజలు చాటి చెబుతున్నారు. ✤

# రమజాన్ దివ్య మాసమా సలాం..!!

**- యండి. ఉస్మాన్ ఖాన్**

*రమజాన్ మాసం రాకడతో*
*మనస్సు వెలుగు పూలు పూసింది*
*ఆత్మానందంతో పాటు*
*పరిశుద్ధతా పరిమళం వెదజల్లింది.*

*ధ్యానంతో ఆత్మబలం పెరిగి,*
*విశ్వాసం పురివిప్పి నాట్యమాడింది*
*శాంతి ప్రేమ కరుణ జాలి దయ*
*ప్రవాహంలా పరుగులు తీసింది.*

*హృదయాల్లో భక్తి భావం మొలకెత్తి,*
*మస్తిష్కాల్లో చిగుర్లు తొడిగింది.*
*మాటల్లోని మంచితనం*
*చేతలలో నిరూపితమైంది.*

*రమజాన్ పుణ్య కాలంలో*
*విస్తారమవుతున్న ప్రేమ*
*రమజాన్ కాని కాలంలోనూ*
*కరుణతో తొణికిసలాడాలి హృదయ సీమ.*

*పవిత్రతకు ప్రాధాన్యమిచ్చి,*
*అనైతికతకు వీడ్కోలు పలకాలి*
*క్రోధాన్ని నివారించి*
*సమాధానంగా జీవించాలి.*

*ప్రేమ, సహనం, మంచీ, మానవత*
*ఇదే రమజాన్ సారం*
*కాంతిలా శాంతితో మన జీవితం*
*సాగిపోవాలి కలకాలం.*

*మనదారిలో ఆధ్యాత్మికత*
*మన ప్రేమలో మానవత*
*ప్రవక్తల పథం మనకు ప్రేరణ*
*రమజాన్ శిక్షణ మనకు ధారణ.*

*సదఖ, ఫిత్రా, జకాతులతో*
*నిరుపేద గాయాలకు మలాం*
*సమాజంలో మానవీయ పరిమళాలు వెదజల్లే*
*రమజాన్ దివ్య మాసమా నీకు సలాం!!*




# ఆర్థిక న్యాయానికి ఆలంబన

**ఆయేషా తస్లీం**

**జకాత్ ద్వారా, ఇస్లామీ దానధర్మాల ద్వారా లభించే సొమ్మును పేదరిక నిర్మూలన కోసం, సమాజ సంక్షేమం కోసం సమర్థవంతంగా ఉపయోగిస్తోంది జకాత్ సెంటర్ ఇండియా.** ముస్లిం సముదాయంలోని అత్యంత పేదల విద్య, ఆరోగ్యం, జీవనోపాధి సాధికారతల కోసం ప్రయత్నిస్తోంది. అత్యంత అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చి వారిని పైకి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తోంది. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్నివ్వడం, స్వావలంబనను ప్రోత్సహించడం సంస్థ ప్రధానోద్దేశ్యం.

జకాత్ సెంటర్ స్థాపించి ఇప్పటికి మూడు సంవత్సరాలయ్యింది. ఈ మూడేళ్ళలో సాధించిన విజయాలను వార్షిక నివేదిక 2024 విడుదల సందర్భంగా సంస్థ కార్యదర్శి అబ్దుల్ జబ్బార్ సిద్ధిఖీ వివరించారు. ఈ కాలంలో దాదాపు 5,000 కుటుంబాలు ఆర్థిక స్వాలంబన సాధించడానికి జకాత్ సెంటర్ తోడ్పడిందన్నారు.

జకాత్ సెంటర్ 2022లో స్థాపించబడింది. అప్పట్లో జకాత్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జమాఅత్ ప్రముఖులు చెప్పిన మాటలు నేడు నిజం చేసి చూపిస్తున్నారు. 2022 మార్చి 26వ తేదీన జకాత్ సెంటర్ ను జమాఅత్ అధ్యక్షులు జనాబ్ సాదతుల్లా హుస్సేనీ ప్రారంభించారు. ఢిల్లీలోని జమాఅత్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో జకాత్ సెంటర్ ప్రారంభోత్సవం జరిగింది. అప్పుడు జమాఅత్ అధ్యక్షులు మాట్లాడుతూ ఇస్లాంలోని ఐదు మూలస్తంభాల్లో ఒకటైన జకాత్ కేవలం ఒక ఆరాధన మాత్రమే కాదని, ఇది వ్యక్తిగత ఆధ్యాత్మిక ప్రక్షాళనకు మార్గమని అన్నారు. జకాత్ చెల్లింపు, పంపిణీల విషయమై ముస్లిం సమాజంలో మరింత అవగాహన పెరగవలసిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన జకాత్ సెంటర్ వెబ్ సైట్ www.zakatcenterindia.org ను కూడా ప్రారంభించారు. ఈ వెబ్‌సైటులో ముస్లిముల ధార్మిక విధి అయిన జకాత్ గురించి సమగ్ర సమాచారం అందించారు. ఎవరు జకాత్ చెల్లించాలి? ఎవరికి ఇవ్వాలి? ఎంత ఇవ్వవలసి ఉంటుంది? వగైరా ప్రశ్నలకు సమాధానాలు ఈ వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు, జకాత్ సెంటర్ చైర్మన్ అమీనుల్ హసన్ మాట్లాడుతూ ఈ మొత్తం వ్యవస్థ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా ఉంటుందని చెప్పారు. జకాత్ సెంటర్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పేమెంట్ గేట్ వేతో ఇంటిగ్రేట్ చేయడం జరిగిందని అన్నారు. చెల్లింపులు సులభతరం చేయడానికి క్యూఆర్ కోడ్ వెసులుబాటు కూడా ఉంది.

అప్పట్లో జకాత్ సెంటర్ కార్యదర్శి అబ్దుల్ జబ్బార్ సిద్దీకీ మాట్లాడుతూ ముస్లిం సమాజంలోని నిరుపేదలను ఆదుకో

వడంతో పాటు జకాత్ సెంటర్ వల్ల దేశంలో పేదరికాన్ని పారదోలే అవకాశాలు కూడా ఉన్నాయని చెప్పారు.

1 . ధనికుల నుంచి సంపద పేదవారికి పంపిణీ కావడం వల్ల లభించే సామాజిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను ప్రజలకు అవగాహన కలిగించడం.

2 . దివ్యఖుర్ఆన్ సూచనల ప్రకారం పేదలను ఆదుకునే ఉన్నతోద్దేశ్యంతో జకాత్, ఉష్ర్ నిధులను సేకరించి నిర్వహించడం.

3 . పేదల సంక్షేమానికి అవసరమైన పెన్షన్లు, రేషను, స్కాలర్ షిప్పులు, స్టయిఫండ్లు, ఉపాధి సహకారం, వైద్యసహాయం అందించడం.

4 . కేవలం జకాత్ పొందే హక్కు ఉన్నవారి ప్రయోజనాల కోసం సంస్థలను స్థాపించి నిర్వహించడం.

5 . జకాత్ కార్యక్రమాల నిధుల సేకరణకు ఉపకరించే వినూత్న పద్ధతులు, వ్యూహాలను తెలుసుకోడానికి పరిశోధనలను ప్రోత్సహించడం.

జకాత్ సెంటరు వెబ్‌సైటులో జకాత్‌కు సంబంధించిన వివరాలన్నీ ఉన్నాయి. జకాత్ అంటే ఏమిటి? నిసాబ్ (జకాత్ చెల్లించేవ్యక్తి ఆర్థిక స్తోమత, జకాత్ పొందే వ్యక్తి ఆర్థిక స్తోమత వివరాలు) అంటే ఏమిటి? జకాత్ కాలిక్యులేటర్, స్కీములు, బ్యాంకు వివరాలు వగైరా అన్నీ ఉన్నాయి.

జకాత్ అంటే శాబ్దిక అర్థం శుభ్రం చేయడం. తన వద్ద ఉన్న సంపదలో రెండున్నర శాతం జకాత్‌గా చెల్లించడం ద్వారా సంపదను శుద్ధి చేసుకోవడమే జకాత్. స్తోమత ఉన్న ప్రతి ముస్లిం తప్పక చెల్లించాలి. ఇది పేదల హక్కు, సంపన్నుల బాధ్యత.

జకాత్ సెంటరు ప్రారంభమైన తర్వాతి నుంచి మహారాష్ట్ర, బీహార్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణతో సహా 11 రాష్ట్రాల్లోని 20 కంటే ఎక్కువ నగరాలకు విస్తరించింది. ఆయా రాష్ట్రాల్లో అర్హులైన పేదలను గుర్తించి ఆదుకోవడం జరిగింది. 2024లో జకాత్ సెంటరు దాదాపు 6.2 కోట్ల రూపాయల జకాత్ నిధులను సేకరించింది. నిధులన్నీ లబ్ధిదారులకు పంపిణీ చేయబడ్డాయి.

జకాత్ సెంటరు కార్యక్రమాల గురించి సిద్దీఖీ వివరిస్తూ, జీవనోపాధి, విద్య, సంక్షేమం అనే మూడు రంగాలకు ప్రాముఖ్యమిస్తున్నామన్నారు. గత మూడు సంవత్సరాలలో జకాత్ దాతలు 4,923 మందికి పైగా గ్రహీతలను ఆదుకున్నారు.

దేశంలో ఒక లక్ష కోట్ల రూపాయలు జకాత్ నిధుల సేకరణకు అవకాశం ఉంది. ప్రస్తుతం కేవలం 30 వేల కోట్ల రూపాయలు మాత్రమే సేకరించబడుతున్నట్లు తెలుస్తోంది.

జకాత్ గురించి మాట్లాడుతున్నప్పుడు డంకన్ గ్రీన్ పేరు తప్పక గుర్తుకు వస్తుంది. ఆక్స్ ఫామ్ సంస్థకు స్ట్రాటజిక్ అడ్వయజర్‌గా పనిచేసిన డంకన్ గ్రీన్ గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ ప్రచురించిన "యాన్ యాక్ట్ ఆఫ్ ఫెయిత్" నివేదికను చదివాడు. ఆ నివేదిక ప్రకారం:

ప్రపంచవ్యాప్తంగా మానవీయ సహాయం అవసరమైన సంక్షోభాలు అనేకం తలెత్తుతున్నాయి. అంతర్జాతీయ మానవీయ సహకారం కోసం నిధులు పెరుగుతున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. చాలా మందికి తెలియకుండానే ఒక గొప్ప ధార్మిక విధి రూపంలో జకాత్ నిధులు మానవీయ సహకారాన్ని అందిస్తున్నాయి. ఇస్లామీయ సోషల్ ఫైనాన్సింగ్ ఇది. మానవీయ సహాయానికి అవసరమైన నిధులను అందించే ఇలాంటి సోషల్ ఫైనాన్సింగ్ టూల్స్ ఇస్లాములో చాలా ఉన్నాయి. ఈ విషయమై గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ సేకరించిన డాటా ప్రకారం:

స్వచ్ఛంద సంస్థల ద్వారా 2013లో 434 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే 2900 కోట్ల రూపాయల ఇస్లామీయ మానవీయ సహకార నిధులు పంపిణీ అయ్యాయి. ఇవి స్వచ్ఛంద సంస్థల ద్వారా పంపిణీ అయిన నిధులు. ఇందులో జకాత్ ఇతర సదఖాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థల వంటి అధికార సంస్థలు సేకరించిన జకాత్ నిధుల విషయానికి వస్తే, ముస్లిం దేశాల్లోనే ఇలా ప్రభుత్వ సంస్థలు జకాత్ నిధులను సేకరించడం జరుగుతుంది. ఇండోనేషియా, మలేషియా, ఖతర్, సౌదీ అరేబియా, ఎమన్ దేశాల డాటాను గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ సేకరించింది. ప్రపంచ ముస్లిం జనాభాలో 17 శాతం ఈ దేశాల్లో ఉంది. ఈ దేశాల్లో వసూలు చేయబడిన జకాత్ నిధులు ఏటా 5.7 బిలియన్ అమెరికన్ డాలర్లు. ఇది కేవలం 17 శాతం ముస్లిం జనాభా ఉన్న దేశాల జకాత్ నిధుల వివరాలు. మొత్తం ముస్లిముల జకాత్ నిధులు, ఇతర సదఖాల నిధులు కూడా కలుపుకుంటే ఈ మొత్తం ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. సేకరించిన డాటా ప్రకారం తెలిసిన మరో విషయమేమంటే, జకాత్ నిధుల్లో 23 నుంచి 57 శాతం వరకు మానవీయ సహకారం కోసం వాడుతున్నారు. ఇప్పుడు జకాత్ వ్యవస్థ, జకాత్ ద్వారా పంపిణీ అయ్యే నిధుల గురించి మొత్తం ప్రపంచం మాట్లాడుతోంది. 2012లో జరిగిన ఒక సర్వే ప్రకారం 200 బిలియన్ డాలర్లు నుంచి 1 ట్రిలియన్ డాలర్లు వరకు ఏటా జకాత్ పంపిణీ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా 2011లో పంపిణీ అయిన మానవీయ సహాయం 13 బిలియన్ డాలర్లు మాత్రమే. జకాత్ రూపంలో పంపిణీ అయ్యే సహాయం దీనికన్నా

దాదాపు 15 రెట్లు ఎక్కువ. అసలు మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా దేశాల మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో రెండున్నర శాతం అంటే కనీసం 65 బిలియన్ అమెరికన్ డాలర్లు ఉంటుంది. ఇది ఈ దేశాల్లో జకాత్ గురించిన బండ లెక్క. ప్రపంచవ్యాప్తంగా ముస్లిముల జకాత్ లెక్కలు తీస్తే ఎంత ఎక్కువగా ఉంటుందో అంచనా వేయవచ్చు. 2004లో ఆర్థికవేత్త హబీబ్ అహ్మద్ జకాత్ నిధులను లెక్కించి ముస్లిం దేశాలు జకాత్ నిధులను సక్రమంగా వినియోగిస్తే పేదరికం అన్నదే ఉండదని వివరించాడు.

డంకన్ గ్రీన్ జకాత్ ప్రత్యేకతను కూడా వివరించాడు. అన్ని మతధర్మాలు దానాన్ని ప్రోత్సహిస్తాయి. కాని జకాత్ విభిన్నమైనది. ఇది తప్పనిసరిగా చెల్లించవలసిందే. స్వచ్ఛందంగా ఇష్టమైతే ఇవ్వడం లేకపోతే లేదని తప్పించుకోవడం కుదరదు. అలాగే ఫిత్ర్ కూడా తప్పనిసరిగా ఇవ్వవలసిందే. ఈ సందర్భంగా డంకన్ గ్రీన్ ఆర్థిక అసమానత్వంపై పుస్తకం రాసిన థామస్ పికెటిని ప్రస్తావిస్తూ, ఇస్లాములో జకాత్ రూపంలో మనకు సంపద పన్ను ఆల్రెడీ ఉందన్న విషయం ఆయనకెవరైనా చెప్పండయ్యా అన్నాడు. అంతేకాదు, ప్రపంచంలో ప్రతి నలుగురిలో ఒకరు తప్పనిసరిగా ఈ పన్ను చెల్లిస్తున్నారు. ప్రపంచ జనాభాలో ముప్ఫయి శాతం ముస్లిములున్నారు.

ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటుంది. ప్రపంచంలో అనేక దేశాల్లో ప్రజలు అనేకమంది క్లిష్టపరిస్థితుల్లో దయనీయంగా బతుకుతున్నారు. సహాయ సహకారాల కోసం ఎదురు చూస్తు న్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ దేశాలు 2013లో అంతర్జాతీయ మానవీయ సహకారానికి మొత్తం 2.2 బిలియన్ డాలర్లు అందించాయి.

అంతర్జాతీయంగా మానవసహకారాన్ని అందించే సంస్థలు ఇప్పుడు నిధుల కోసం జకాత్, సదకాల వైపు కూడా చూస్తున్నాయి. డంకన్ గ్రీన్ మరో మంచి మాట కూడా చెప్పాడు. పాశ్చాత్యులు డిజైన్ చేసిన మానవీయ సహకారం కోసం జకాత్ నిధులను సేకరించ డానికి ప్రయత్నాలు చేయడంతో పాటు, అసలు ఇస్లాములో మానవీయ సహకారానికి చూపించే దిశానిర్దేశనం ఏమిటో కూడా నేర్చుకోవాలని అన్నాడు. ఇంతకు ముందు చెప్పినట్లు థామస్ పికెటీ చాలా గొప్ప ఆర్థికవేత్త అయినప్పటికీ, సంపద పంపిణీలో అసమానత్వం గురించి ఆయన ఆందోళన, ఆవేదన చెందిన ప్పటికీ, ఆయనకు ఇస్లాం ప్రతిపాదించిన సంపద పంపిణీ గురించి తెలియదు. అందుకే డంకన్ గ్రీన్ ఆయనకు ఈ విషయం ఎవరైనా చెబితే బాగుండును అన్నాడు. అలాగే మానవీయ సహకారం ఎలా ఉండాలన్న విషయంలోను ఇస్లామ్ దారి చూపిస్తుంది.

“మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి.” (అల్ బఖర: 262) అని చెప్పింది దివ్యఖుర్ఆన్.

రమజాను మాసం ముస్లిములకు ఒక శిక్షణాకాలం వంటిది. ఇస్లామీయ బోధనలు, ప్రమాణాల ప్రకారం జీవితాన్ని గడిపే శిక్షణ ఇచ్చే మాసం రమజాన్. ఈ నెల రోజుల శిక్షణ తర్వాత మిగిలిన పదకొండు నెలలు ఈ ప్రకారమే జీవించడం అలవడు తుంది. ఆరాధనల విషయంలో ఇస్లామ్ నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయవలసిన నమాజ్, రోజా, జకాత్, హజ్ వంటి ఆరాధనలే కాదు, దేవుని ప్రసన్నత కోసం ఖుర్ఆన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పని ఆరాధన కిందికే వస్తుంది. చివరకు ప్రేమగా తన భార్య నోటికి ఒక ముద్ద ఆహారం అందించడం కూడా పుణ్యప్రదమే. కాబట్టి ఆరాధనల నిర్వచనం ఇస్లాములో విశిష్టమైనది. దైవప్రసన్నత పొందే పనులు ఎప్పుడు చేసినా పుణ్యప్రదమైనవే, ఆరాధనలే. రమజాను మాసంలో ఇవే పనులకు అనేక రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది. కాబట్టి ముస్లిములు ఈ మాసంలో అత్యధికంగా దానధర్మాలు చేస్తుంటారు.

ఇస్లాములో దానధర్మాలు రెండు రకాలు. ఒకటి తప్పనిసరిగా చేయవలసిన దానం. దీన్ని జకాత్ అంటారు. జకాత్ అంటే శాబ్దిక అర్థం శుభ్రం చేయడం. తన వద్ద ఉన్న సంపదలో రెండున్నర శాతం జకాత్‌గా చెల్లించడం ద్వారా సంపదను శుద్ధి చేసుకోవడమే జకాత్. రమజాను మాసంలో తప్పనిసరిగా చేసే మరో దానం ఫిత్ర్. రమజాను మాసం తర్వాత ఈద్ పండగ నమాజు కన్నా ముందే ఇది తప్పనిసరిగా చెల్లించాలి. ప్రతి కుటుంబంలో ఎంత మంది ఉంటే, తల ఒక్కంటికి రెండున్నర కిలోల ధాన్యం లేదా దాని వెల పేదలకు ఇవ్వాలి. పండగ రోజున పేదసాదలు కూడా ఆనందంగా పండగ చేసుకునే ఏర్పాటిది. ఇవి రెండు తప్పని సరిగా చేయవలసిన దానాలు. ఇవి కాకుండా సదఖా రూపంలో స్వచ్ఛందంగా చేయవలసిన దానాలను కూడా ప్రోత్సహించడం జరిగింది. అందుకే రమజాను మాసంలో విస్తృతంగా ముస్లిములు దానధర్మాలు చేయడం మనకు కనబడుతుంది.

“మేము ఇస్రాయీలు సంతానం నుండి మరొక వాగ్దానం తీసుకున్నాము. దానిని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి : “అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రులను, బంధువు లను, అనాథలను, నిరుపేదలను ఆదరించాలి. ప్రజలను సహృదయంతో పలుకరించాలి. నమాజును స్థాపించాలి. జకాత్ ఇవ్వాలి.” (అల్ బఖర : 83)

జకాత్ లేదా తప్పనిసరిగా చెల్లించవలసిన దానం గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి వాక్యాలు అనేకం కనిపిస్తాయి. సమాజంలో దురదృష్టవంతులు, నిర్భాగ్యులైన వారిని ఆదుకోవాలని దానధర్మాలు చేయాలని ఇస్లామ్ బోధిస్తుంది. ముఖ్యంగా రమజాను మాసంలో అందువల్లనే ముస్లిములు ఇతోధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. దేవుని ప్రసన్నతతో పాటు ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని కూడా అనుభవిస్తారు.

ఇలా చేసే దానధర్మాల ప్రాముఖ్యమేమిటి? అన్నది ఆలోచించవలసిన విషయం. ప్రపంచవ్యాప్తంగా మానవీయ సహాయం అవసరమైన సంక్షోభాలు అనేకం తలెత్తుతున్నాయి. అంతర్జాతీయ మానవీయ సహకారం కోసం నిధులు పెరుగుతున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. చాలా మందికి తెలియకుండానే ఒక గొప్ప ధార్మిక విధి రూపంలో జకాత్ నిధులు మానవీయ సహకారాన్ని అందిస్తున్నాయి. ఇస్లామీయ సోషల్ ఫైనాన్సింగ్ ఇది. స్వచ్ఛంద సంస్థలు జకాత్ వసూలు చేయడం లేదా ముస్లిములు వ్యక్తిగతంగానే జకాత్ అవసరమైన వారికి ఇవ్వడం జరుగుతుంది. స్వచ్ఛంద సంస్థలు జకాత్ వసూలు చేసి సేవాకార్యక్రమాలకు, విద్య వైద్యం తదితర కార్యక్రమాలకు వినియోగించడం కూడా జరుగుతోంది. జకాత్ ఫౌండేషన్ భారతదేశంలో సివిల్ సర్వీసు కోచింగ్ వంటి సేవలు అందిస్తోంది. జకాత్ సెంటర్ పేదల ఆర్థికాభివృద్ధికి ప్రయత్నిస్తోంది. సమాజంలో సంపద పంపిణీకి జకాత్, సదఖాలు గొప్ప సాధనాలు. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం సాధించడానికి ఇవి ఎంతైనా తోడ్పడతాయి. దాంతో పాటు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో కష్టాలపాలైన నిర్భాగ్యులను ఆదుకోవడానికి అవసరమైన హ్యూమానిటేరియన్ నిధులు కూడా జకాత్ వల్ల లభిస్తాయి

ఆహారాన్ని పంచుకు తినే అద్భుతమైన అందమైన దృశ్యాలు రమజాన్ మాసంలో కనువిందు చేస్తాయి. మనిషి తన కడుపు నిండా తినరాదని కనీసం మూడింట ఒక వంతు కడుపు ఖాళీగా ఉండాలని ప్రవక్త బోధించిన మాటలు గాని, రమజానులో ఉపవాసాలు కాని కేవలం ఆరోగ్య నియమాలు కాదు, కేవలం సమానత్వానికి నిదర్శనాలు మాత్రమే కాదు, సానుభూతిని పెంచే సాధనాలు మాత్రమే కాదు. దేవుడు చూస్తున్నాడన్న బాధ్యతాభావంతో చేసే పనులివి. దేవుడు చూస్తున్నాడన్న బాధ్యతాభావం సంవత్సరమంతా, అందరిలో అన్ని పనుల్లో ఉంటే ఆ సమాజం ఎంత అద్భుతంగా ఉంటుంది. ఇస్లామ్ కోరే సమాజం అలాంటిది. అలాంటి సమాజం ఉనికిలోకి రావాలంటే అవసరమైన శిక్షణ ఇచ్చే మాసమే రమజాను మాసం. ❖

# గాజా- ఓ గాజా!



మానవ చరిత్ర రక్తంతో తడిసింది

భవన శిథిలాల్లో మౌనరోదన

క్షుద్బాధ పేగుల్ని కుదిపేస్తే

భయం ఊపిరిగా విలపిస్తే

పసికూనల్ని ఫిరంగులు మసి చేస్తే

తల్లి ఒడిలో పసికూనలు తల్లడిల్లితే క్షతగాత్రులపైన శతఘ్నుల మోత

ఛిద్రమైన శరీరాల నిస్సహాయ విలాపం

నివాసాలే శవాల గుట్టల నిలయాలు నివ్వెరపోయి నిశ్చేష్టగా మిగిలిన ప్రపంచం

దారీతెన్నూ కానరాని పాలస్తీనా!

నిన్ను ఎవరు కనికరించే మానవోత్తములు?

ఎన్నాళ్ళిలా మరణమృదంగ పరిష్వంగంతో సహవాసం?

ఎవరిపై విద్వేషం? ఎందుకో ఈ రక్తపాతం?

చిగురుటాకు పెదవులపై

మానవ విషం చిమ్మిన మరకలు

ఏ అరాచకీయం పులిమిన రాక్షసత్వం?

అధికార మదం తలకెక్కి నివారించని నిష్క్రియాపరత్వం

ప్రాణం పోసే శాస్త్ర సాంకేతిక ప్రజ్ఞ

ప్రాణం తీయడమేమిటి?

మారణాస్త్రాల మానవ హననం

అంతం కాదా ఈ భూతల విధ్వంసం?

ఏ దేశమైనా –

రక్తమాంసాలు పొదిగిన జీవులే కదా!

నరహంతక కిరాతకాల్ని తుదముట్టించే నరుడెవ్వరు?

**(ఇటీవల పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ ఘాతుకాల నేపథ్యం)**

– కె. లక్ష్మణ్ గౌడ్
లుంబిని, మహబూబ్‌నగర్
సెల్ నం. 9794939509




**నెలరోజుల ఉపవాస దీక్షలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతగా జరుపుకునే సంతోష సంబరాలే ఈద్. రమజాన్ పండుగగా పిలుచుకునే ఈదుల్ ఫిత్ర్ ప్రాశస్త్యం గురించి తెలుసుకుందాం..**

నెలరోజుల పాటు రోజంతా పస్తులుండి చేసిన కఠోర దీక్షలు.. రాత్రుళ్లు గంటల తరబడి ప్రభువు ముందు చేసిన తరావీహ్ నమాజులు.. ఉన్నదాంట్లో బీదసాదలకు చేసిన దానాలు.. వీటన్నింటి ప్రతిఫలం లభించే రోజే 'ఈదుల్ ఫిత్ర్'. ముస్లిములకు ప్రధానమైన రెండు పండుగలలో రమజాన్ పండుగగా పిలుచు కునే ఈదుల్ ఫిత్ర్ ఒకటి. నెలరోజుల పాటు అన్ని వ్యసనాలను త్యజించి, ఆకలి దప్పులను సహించి, అల్లాహ్ మెప్పుపొందేందుకు దైవదూతలా జీవితం గడిపిన వారే పండుగ శుభాలకు అర్హులని ప్రవక్త బోధనలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇలాంటి వారు ఈద్ రోజు నమాజుకోసం ఈద్గాహ్‌కు వెళుతుంటే స్వర్గలోకాల నుంచి దైవదూతలు దిగివచ్చి స్వాగతం పలుకుతారంట. "ఓ అల్లాహ్ ప్రియ దాసులారా పదండి, మీరు పాటించిన ఉపవాసాలకు, రాత్రుళ్లు దైవారాధనలో నిల్చున్నందుకు, నెలసాంతం ప్రభువు విధేయతను చాటుకునేందుకు మీరు పడిన శ్రమకు ఈ రోజు మీకు బహుమానం లభించే రోజు. ఈ రోజు మిమ్మల్ని సత్కరించే రోజు. మీ పాపాలను మన్నించి మిమ్మల్ని ప్రక్షాళనం చేసేరోజు" అని దైవదూతలు ఈద్గాహ్ వైపునకు వెళుతున్నంత సేపూ ఘనస్వాగతం పలుకుతారంట. కూలివాడికి వేతనం లభించే రోజుగా అల్లాహ్ ఈద్‌ను అభివర్ణించాడు. "ఈరోజు మీరు కోరుకున్నదల్లా ప్రసాదిస్తాను. మీరు నా పట్ల అలక్ష్యం, అవిధేయత చూపనంతకాలం నేను మీకు అనంతమైన అనుగ్రహ భాగ్యాలు అనుగ్రహిస్తాను' అని అల్లాహ్ ఈద్ రోజు ప్రకటన చేస్తాడు. 'మీరు నన్ను ప్రసన్నం చేసుకోవడంలో సఫలమయ్యారు. మీ ప్రయత్నా లన్నీ నాకెంతగానో నచ్చాయి. ఈ రోజు నేను మీతో పూర్తిగా ప్రసన్నుడనయ్యాను' అనే శుభవార్త ఈద్ రోజు వినిపిస్తాడు. రమజాన్ పరమార్థాన్ని, రోజా ఉద్దేశాలను మసలుకొని రమజాన్ నెలను నిష్ఠాగరిష్టలతో గడిపిన వారికే ఈ శుభవార్త అని ప్రవక్త(స) చెప్పారు. రమజాన్ నెలను అలక్ష్యంగా, మనోవాంఛలను త్యజించ కుండా మొక్కుబడిగా గడిపిన వారు ఈద్ శుభాలకు నోచుకో లేరన్నది ప్రవక్త ఉద్బోధ. చిల్లులు పడిన పాత్రతో నీటిని నింపడం సాధ్యమా? అలానే ఆంతర్యానికి పడ్డ మనోవాంఛలనే చిల్లులను మరమ్మత్తు చేసుకోకుండా చేసే దైవారాధనలైనా, ఉపవాసాలైనా బూడిదలో పోసిన పన్నీరవుతాయి. "ఒక వ్యక్తి తిన్నంతనే వాంతి చేసుకుంటున్నాడు. అలాంటి వ్యక్తికి ఆ ఆహారం ఎలాంటి ప్రయోజనాన్ని, శక్తిని కలిగించలేదు. అలాగే రమజాన్ నెలరోజుల ఉపవాసాల పరమార్థాన్ని పండుగ మరుక్షణమే త్యజిస్తే ఆ నెల రోజుల శిక్షణ ఎలాంటి లాభమూ కలిగించదు' అని అంటారు ప్రముఖ ఇస్లామిక్ తత్వవేత్త మౌలానా మౌదూది. రమజాన్ పరమార్థాన్ని ఒంటపట్టించుకున్న వారే ఈద్ కానుకకు అర్హులని అల్లాహ్ శుభవార్త.

ఈద్ రోజు సంతోషాల రోజు. ప్రేమను పంచుకునే రోజు. శుభకాంక్షలు తెలుపుకునే రోజు. శుభవార్త పొందే రోజు. సంబరాలు జరుపుకునే రోజు. నెలరోజుల ఉపవాసాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు అల్లాహ్ ఘనతను చాటేరోజు. 'అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ ' అని తక్బీర్ పలుకుతూ ఈద్గాహ్ కు వెళ్లేరోజు. అల్లాహ్ ముందు సాష్టాంగపడి కృతజ్ఞతలు తెలుపుకునే రోజు. అందుకే ఈ రోజు విశ్వాసులు తలంటు స్నానాలు చేసి కొత్తబట్టలు ధరించి, అత్తరు పరిమళాలు పూసి అల్లాహ్ ఘనతను కీర్తించే దాసులంటే అల్లాహ్ కు ఎంతో ఇష్టం. ఈద్ రోజు తన దాసులను చూసి అల్లాహ్ మురిసిపోతాడు. 'నా దాసులు నెలరోజులు నా ప్రసన్నత పొందేందుకు ఎంతో శ్రమపడ్డారు. ఈరోజు ప్రతిఫలం కోసం సిద్ధమవుతున్నారు.' అని తన దైవదూతలతో అంటాడు. అందుకే ఈద్ రోజు, ఈద్ కంటే ముందు రేయిని అత్యంత భక్తి శ్రద్ధలతో గడపాలన్నది మహనీయుల ఉద్బోధ. ప్రతిఫలం పొందే సమయంలో నిర్లక్ష్యంగా గడిపితే పడిన శ్రమ వృథా అవుతుంది. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పండుగ పూట సంబరాలు చేసుకునే బదులు తీవ్రంగా రోదించేవారు. ఉపవాసాలు, చేసిన దానధర్మాలు, నెలరోజుల పాటు చేసిన దైవారాధనలు అల్లాహ్ స్వీకృతి పొందాయో లేదోనన్న ఆందోళనతో వెక్కివెక్కి ఏడ్చే వారంట. ఉపవాసాల ఉద్దేశమైన 'తఖ్వా' దైవభీతి పెంపొందక పోతే ఉపవాసాలన్నీ వ్యర్థమైపోతాయి. ఎవరికైతే తఖ్వా దొరికిందో గొప్ప అనుగ్రహాన్ని, ఎనలేని విజ్ఞతను పొందినవారవుతారు. 'దారి కిరువైపులా ముళ్లకంప ఉంది. అలాంటి సమయంలో ఒంటిపై ఉన్న వస్త్రాన్ని ఆ ముళ్లల్లో చిక్కుకోకుండా వస్త్రాన్ని దగ్గరగా తీసుకుని జాగ్రత్తగా ముందుకెళ్లడమే తఖ్వా'' అని చెప్పారు హజ్రత్ ఉమర్ (రజి). తళుకుబెళుకుల ఈ మాయాప్రపంచంలో మనోవాంఛలు గుర్రాల్లా పరుగెడుతాయి. వాటన్నింటినించి మనల్ని మనం కాపాడుకోవడమే దైవభీతి అన్నారు. 'స్వర్గం రెండు అడుగుల దూరంలో ఉంది. ఒక అడుగు మనోకాంక్షలపై పెట్టు, రెండో అడుగు స్వర్గంలోనే ఉంటుంది' ప్రవక్త ఉద్బోధించారు. మనోకాంక్షలను కట్టడిచేయడానికి వచ్చిన రమజాన్ శిక్షణను ఎంతవరకు సద్వినియోగం చేసుకున్నామో ఈ పండుగ సందర్భంగా ఆత్మవిమర్శ చేసుకోవాలి. సముద్రంలో పడవ నీళ్లల్లో ప్రయాణిస్తున్నప్పటికీ చుక్కనీరును లోనికి రానివ్వదు. నీళ్లల్లో పడవ ప్రయాణిస్తున్నంతసేపూ ఆ ప్రయాణం సాఫీగా సాగుతుంది. పడవలో నీళ్లు చేరితే మాత్రం ప్రాణాంతకమే. అలాగే మీరు ప్రపంచంలో ఉండండి. కానీ మీలోకి ప్రపంచాన్ని దరిచేరనివ్వ కండి' అని అంటారు సూఫీలు. ప్రపంచమే సర్వస్వంగా ప్రేమించేవారి హృదయాల్లో దైవభీతికి స్థానంలేదు. ఇలాంటి వారు చేసే సజ్దాలు, నమాజులు, ఉపవాసాలు మొక్కుబడిగా సాగుతాయి. ప్రపంచంలో ఒక బాటసారిలా జీవితాన్ని గడపాలన్నది ప్రవక్త ఉద్బోధ.

## ఫిత్రా దానాలు..

'ఫిత్ర్' అంటే ఉపవాస వ్రతాలను విరమించడం లేక ముగించడం. రమజాన్ ఉపవాసాలను పూర్తిచేసిన సందర్భంగా స్తోమత కలిగిన ప్రతీ ముస్లిమ్ పురుషుడు, స్త్రీ సంతోషంగా పేదలకు కొంత దానాన్ని అందజేయవలసి ఉంటుంది.' రమజాన్ పండుగకు ముందు చేసే దానాన్ని ఫిత్రా దానం అంటారు. ఫిత్రా దానాలు పాపాల పరిహారంగా ఉపయోగపడతాయి. ''ఉపవాస వ్రత సమయంలో పొరపాటున మన నోట పనికిమాలిన మాటలు వెలువడవచ్చు. అదీగాక అనాలోచితంగా, అసంకల్పితంగా మన హృదయంలో చెడు తలంపులు కూడా వస్తుంటాయి. అందువల్ల దైవప్రవక్త(స) ఫిత్రా దానాన్ని (మనకు) విధిగా నిర్ణయించారు. ఫిత్రా దానం వల్ల ఉపవాసాలు పరిశుద్ధమవుతాయి. వేరొకవైపు ఈ దానం వల్ల పేదవాళ్లకు కూడు, గుడ్డ లాంటి ప్రాథమిక అవసరాలు నెరవేరుతాయి.' అని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ ఊద్ (రజి) ఫిత్రా ప్రాముఖ్యాన్ని వివరించారు.

## ఫిత్రా దానాలు ఎవరు చెల్లించాలి?

ఫిత్రా చెల్లింపు స్తోమత కలిగిన వారు తప్పనిసరిగా నెరవేర్చవలసిన బాధ్యత. ఇది నిరుపేదల హక్కుగా భావించి దానం చేయాలి. రమజాన్ రోజాలు పాటించనవారే కాదు, పాటించలేకపోయిన వారు సయితం ఆర్థిక స్తోమత ఉన్నప్పుడు పిత్రా తప్పకుండా చెల్లించాలి. కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అంతమంది తరపున ఫిత్రా చెల్లించాలి. ఫిత్రా దానంగా సుమారు పావు తక్కువ రెండు కిలోలు గోధుమలుగాని లేక వాటికి సమానమయిన ఖరీదు గల ఇతర ఆహార ధాన్యాలు గాని, డబ్బులుకానీ పేదలకు ఇవ్వాలి. ఈద్ నమాజుకంటే ముందు ఫిత్రా దానం చేయాల్సి ఉంటుంది. పండుగ సంతోషాల్లో నిరుపేదలూ పాలు పంచుకోవాలన్నది ఫిత్రా ఉద్దేశం.

## పండుగ పూట అనాథను అక్కున చేర్చుకున్న ప్రవక్త..

ఆ రోజు పవిత్ర రమజాన్ పర్వదినం.. ప్రవక్త ముహమ్మద్ (స) మహనీయులు ఈద్ నమాజు కోసం కొత్తబట్టలు ధరించి ఇంటినుంచి ఈద్గాహ్‌కు బయలుదేరారు. మక్కా వీధుల్లో పిల్లలంతా కొత్త బట్టలు ధరించి ఈద్ సంతోషాలలో తేలియాడుతున్నారు. ఆ పిల్లల సంతోషాలకు, ఆనందాలకు హద్దుల్లేకుండా

పోయింది. ఈ దృశ్యాలను చూసి ప్రవక్త (స) ఎంతో మురిసి పోసాగారు. కాస్తంత ముందుకు వెళ్లగానే ఒక బాలుడి దీనస్థితిని చూసి ప్రవక్త(స) ద్రవించిపోయారు. అప్పటిదాకా పెదాలపై చిరునవ్వు తొణికిసలాడని ప్రవక్త మోము ఆ బాలుడిని చూసి ఆయన ముఖకవళికలు మారిపోయాయి. చింపిరిజుట్టుతో, మాసిన బట్టలతో రోదిస్తున్న ఆ బాలుడిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. 'ఎందుకేడుస్తున్నావు నాయనా?' అని సముదాయిస్తూ అడిగారు.. ప్రవక్త ఓదార్పుకు ఆ బాలుడి దుఖానికి అంతులేకుండాపోయింది. "మా నాన్న చనిపోయారు, మా అమ్మ కూడా లేదు. ఈ పండుగ పూట నాన్న గుర్తుకొచ్చి ఏడుస్తున్నాను. ఆయనేగనక బ్రతికి ఉంటే ఈ రోజు మిగతా పిల్లల్లాగా నేనూ కొత్తబట్టలు వేసుకునేవాణ్ణి, వాళ్లలాగా నేనూ పండుగ సంతోషాలు ఆస్వాదించేవాడిని' అని ఆ బాలుడు చెబుతుంటే ప్రవక్త (స) నయనాలు వర్షించాయి. ఈ మాటలు విన్నంతనే ప్రవక్త (స) హృదయం జాలి, దయతో ఉప్పొంగింది. ఈద్గాహ్‌కు వెళ్లకుండా ఆ పిల్లాడిని వెంటబెట్టుకుని తన ఇంటికి తీసుకెళ్లారు. తన సతీమణి ఆయిషా (రజి)ని పిలిచి "ఈ బాబుకు స్నానం చేయించు." అని చెప్పి తన ఇంటికి దగ్గరలోనే ఉన్న తన కూతురి ఇంటి నుంచి బాబు వయస్సున్న తన మనవడి కొత్తబట్టలు తెప్పించారు. ప్రవక్త (స) ఆ అనాథ బాలుడికి కొత్తబట్టలు వేసి, అత్తరు పరిమళాలు రాశారు. కళ్లల్లో సుర్మా రాసి ముస్తాబు చేశారు. ఈద్గాహ్‌కు నమాజు కోసం పిల్లాడిని సిద్ధం చేసి ఆ అనాథ బాలుడితో "బాబూ నువ్వు గతంలో మీ నాన్నతో పండుగ నమాజు కోసం ఈద్గాహ్‌కు వెళ్లావా" "అవును ప్రవక్తా వెళ్లేవాడిని". 'మరి మీనాన్న నిన్ను ఈద్గాహ్‌కు నిన్ను ఎలా తీసుకెళ్లేవారు" "మా నాన్న నన్ను తన భుజాలపై కూర్చోబెట్టుకుని తీసుకెళ్లేవారు.' ఈ మాటలు విన్నంతనే ప్రవక్త (స) పూర్తిగా కిందకు వంగి ఆ అనాథ బాలుడిని తన భుజాలపై కూర్చోబెట్టుకున్నారు. ప్రవక్త(స) ఆ అనాథ బాలుడిని తన భుజాలపై కూర్చుండ బెట్టుకుని ఈద్గాహ్‌కు తీసుకెళ్లారు. ఈద్గాహ్‌లో నమాజు జరిగి నంతసేపూ తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. ఆ పిల్లాడిని ప్రవక్త(స) భుజాలపై తీసుకెళ్లడం చూసిన వారంతా ఆశ్చర్య పోయారు. ప్రవక్త(స) పండుగపూట మానవత్వానికి మచ్చుతునకగా నిలిచారు.

## రమజాన్‌లో ప్రారంభం ఏడాదంతా కొనసాగాలి

రమజాన్ నెల రోజులూ ఉపవాసాలు పాటించాము, దైవారాధనలు చేశాము, జకాత్, సదకా, ఫిత్రాల ద్వారా పేదలను ఆదుకున్నాము. ప్రేమ, సహనం, సానుభూతితో పరస్పరం మెలిగాము. ఒకరి తప్పులను మరొకరు పెద్ద మనస్సుతో మన్నించుకున్నాము. అబద్ధం, అవినీతి, చెడుచూపు, వ్యర్థ ప్రేలాపనలన్నీ రమజాన్‌లో చాపచుట్టేశాము. నెల రోజులపాటు మంచి సాంగత్యంలో జీవితం గడిపాము. మంచికి మారుపేరుగా నిలిచాము. ఇదే స్ఫూర్తి కొనసాగినప్పుడే రమజాన్ నెల శిక్షణకు సార్థకత దక్కుతుంది.

కేవలం రమజాన్‌లోనే నమాజులు చేసినవారు మిగితా 11 నెలలూ ఐదు పూటలా నమాజ్ చేయాలనే సంకల్పం చేసుకోవాలి. బ్రతికున్నంత కాలం నమాజ్‌ను వీడనని ప్రతిజ్ఞ చేసుకోవాలి. రమజాన్‌లో జకాత్ దానాలు చేసిన వారు మిగతా రోజుల్లోనూ దానధర్మాలను కొనసాగించాలి. సంపదలో నుంచి జకాత్ దానాన్ని పేదల్లో పంచిపెట్టే ప్రేరణను కొనసాగించాలి. రమజాన్‌లో ఏవిధంగానైతే మోసం, దగా, అబద్ధం, వాగ్దానభంగం, చాడీలు, కల్తీకి పాల్పడటం, లంచం, అవినీతి లాంటి చెడుగులను త్యజించారో జీవితంలో ఎప్పుడూ వాటి జోలికి పోనని గట్టి సంకల్పం చేసుకోండి. మిగితా రోజుల్లోనూ నాలుకను అదుపులో ఉంచుకునేలా జాగ్రత్త పడండి. ఆచితూచి మాట్లాడేలా అలవర్చుకోండి. దైవనామ స్తోత్రం, అల్లాహ్ పవిత్రతను, ప్రవక్త(స)పై దరూద్ పంపించేలా, ఖుర్‌ఆన్ పారాయణం మిగతా పదకొండు నెలలూ కొనసాగాలి.

మన శక్తియుక్తులన్నీ పరలోక జీవిత సాఫల్యం కోసం వెచ్చించాలన్న పాఠాన్ని ఈ రమజాన్ నుంచి ఒంటపట్టించుకోవాలి. ఖుర్‌ఆన్ గ్రంథాన్ని మన మనోమస్తిష్కాల్లో నిక్షిప్తం చేసుకోవాలి. ఖుర్‌ఆన్‌కు అనుగుణంగా మన జీవితాలను మలచుకోవాలి. ఎవరైతే ఈ భావనతో, ఈ సంకల్పంతో ఏడాదిపాటు గడుపుతారో అలాంటి వారి రోజాలే ఫలప్రదమవుతాయి. అలాంటి వారే సౌభాగ్యవంతులు. ఎవరిలో అయితే ఈ సంకల్పం ఉండదో వాళ్లు ఈ నెలకు వీడ్కోలు పలికిన మరుసటి రోజునుంచే దైవభీతి అనే దుస్తులను విప్పేస్తారు. నమాజులను అటకెక్కిస్తారు. మిగతా పదకొండు నెలలు సుఖభోగాల లాలస వెనుక పరుగులు తీస్తారు. ఇలాంటి వాళ్ల రోజాల లక్ష్యం కేవలం ఆకలి దప్పులతో గడపడం తప్ప మరేమీ లేదు. దైవాదేశాలన్నింటినీ ఉల్లంఘిస్తారు. రమజాన్‌లో ప్రదర్శించిన దైవభీతి, ఆకలి దప్పులు, నమాజులన్నీ కేవలం ముప్ఫై రోజుల వరకే పరిమితమవుతాయి. రమజాన్ నెల తరువాత అవన్నీ అతని జీవితం నుంచి చాపచుట్టేస్తాయి. కానీ అల్లాహ్‌కు ఇలాంటి దైవభీతి కానీ, ఇలాంటి ఉపవాసాలు కానీ అక్కరలేదు. ఈ రమజాన్‌లో శ్రీకారం చుట్టిన ఈ మంచి పనులను జీవితాంతం ఆచరిద్దాం.

# సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలి :
## ఎస్ఐఓ రాష్ట్ర అధ్యక్షులు బ్రదర్ అమీర్ ఫహద్






మంచి వ్యక్తిత్వం సంతరించుకొని విద్యార్థులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఏపి రాష్ట్ర అధ్యక్షులు బ్రదర్ అమీర్ ఫహద్ పిలుపునిచ్చారు. సంస్థాగత పర్యటనలో భాగంగా ఆయన నంద్యాల యూనిట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏస్ఐఒ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బ్రదర్ ఫహద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సినిమాలకు, సెల్ ఫోన్ యాప్ లకు బానిసలై పోతున్నారని, కాలేజీల్లో మత్తు పదార్థాలు యధేచ్ఛగా సప్లై అవుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కేవలం దైవ భీతి మాత్రమే విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందిస్తుందని బ్రదర్ ఫహద్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జేఐహెచ్ అధ్యక్షులు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ నైతికంగా దిగజారిపోతున్న సమాజాన్ని కాపాడవలసిన బాధ్యత విద్యార్థులు, యువతదే అన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల నడవడికపై కన్నేసి ఉంచి వారిని రుగ్మతల నుండి కాపాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాజిమె జిల్లా జకరియా, ఎస్ఐఓ యూనిట్ అధ్యక్షుడు ఇందాదుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవుని మెప్పుకోసం

**జునైద్ బుగ్దాదీ (రహ్మాలై)** చదువుకుంటున్న రోజుల్లో ఒకసారి అతని గురువుగారు అతన్ని జుట్టు బాగా పెరిగిపోయింది క్షవరం చేయించుకోమని చెప్పారు. అయితే ఆయన దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు. అయినా సరే క్షురకుడి దగ్గరికెళ్లారు. 'అల్లాహ్ కోసం క్షవరం చేయి' అని అడిగారు. దానికి క్షురకుడు అంగీకరించాడు. క్షవరం పూర్తి చేసిన తరువాత జేబులో నుండి ఒక పొట్లం తీశాడు. అందులో నాణాలున్నాయి. ఆ నాణాల పొట్లాన్ని జునైద్ గారికిస్తూ 'దీన్ని మీ అవసరం కోసం వాడుకోండి' అన్నాడు. ఈ సంఘటన జరిగి కొన్నేళ్లు గడిచిపోయాయి. జునైద్ బుగ్దాదీ తన ధార్మిక విద్యను పూర్తి చేసుకున్నారు. గొప్ప పండితుడిగా పేరు గడించారు. ఒకానొకసారి ఆయన దగ్గరకు బస్రా పట్టణం నుంచి ఓ బృందం వచ్చింది. ఆ బృందంలోని కొందరు జునైద్ బుగ్దాదీ ధార్మిక సేవను మెచ్చుకుని బంగారు నాణాలను సమర్పించుకున్నారు. జునైద్ బుగ్దాదీ ఆ నాణాలను చూసిన వెంటనే క్షురకుడు గుర్తుకొచ్చాడు. వెంటనే అతని దగ్గరికెళ్లి ఆ నాణాల సంచిని అతని చేతిలో పెడుతూ.. "నా దగ్గరకు మొదటిసారి ఏదైనా కానుక వస్తే తమరికి ఇస్తానని సంకల్పం చేసుకున్నాను. ఇదిగో ఈ రోజు మీరు దీన్ని స్వీకరించండి" అని ఆ క్షురకుడికి ఎంతో వినయంతో చెప్పారు. ఇది విన్న క్షురకుడు కోపంతో "మీకు దేవుని పట్ల భయం లేదా?' ఎవరైనా దేవుని మెప్పుకోసం పనిచేసి దానికి ప్రతిఫలం ఆశిస్తారా? ఈ సంచిని తమరే ఉంచుకోండి' అని నిలదీస్తున్నట్లు చెప్పాడు. జునైద్ బుగ్దాదీ నిర్ఘాంతపోయారు. దేవుని మెప్పుకోసం పనిచేసి ప్రజల నుంచి ప్రతిఫలాన్ని ఆశించకూడదన్నది ఈ గాథలో నీతి.

# రమజాన్ స్ఫూర్తి కొనసాగాలి

**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**పవిత్ర రమజాన్ మాసం ముగిసింది. పండుగ పంచిన పరమానందం నుండి ముస్లిం సమాజం ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. నెల రోజులపాటు ఆరాధనలు, సత్కార్యాలు, సదాచారాల్లో మునిగి తేలిన ముస్లిములు, తమకంతటి పరమానందాన్ని పంచిన పవిత్ర రమజాన్ మాసానికి ఘనంగా వీడ్కోలు పలికారు.**



ఈద్‌తో వీడ్కోలు పలికినప్పటికీ, నెల రోజులపాటు అది ఇచ్చినటువంటి తర్ఫీదు అనంతర కాలంలోనూ తొణికిసలాడాలి. పవిత్ర రమజాన్‌లో పొందిన దైవభీతి శిక్షణ, దయాగుణం, సహనం, సోదరభావం, పరస్పర సహకార, సామరస్య భావన, ఒకరి కష్ట సుఖాల్లో ఒకరు పాలుపంచుకునే గుణం, పరమత సహనం, మానవ సమానత్వం లాంటి అనేక సదాచార సుగుణాలకు సంబంధించిన తర్ఫీదు ప్రభావం మిగతా పదకొండు నెలలకూ విస్తరించి, తద్వారా భావి జీవితమంతా మానవీయ విలువలే ప్రతిబింబించాలి. సమస్త మానవాళికీ సన్మార్గభాగ్యం ప్రాప్తమై, ఎలాంటి వివక్ష, అసమానతలులేని, దైవభీతి, మానవీయ విలువల పునాదులపై ఓసుందర సమ సమాజం, సత్సమాజ నిర్మాణం జరగాలి. ఇహపర లోకాల్లో అందరూ సాఫల్యం పొందాలి. ఇదే రమజాన్ ధ్యేయం. ఈధ్యేయం ఏమేరకు నేరవేరుతున్నదో అందరూ ఒకసారి ఆలోచించాలి. ప్రతి యేటా రమజాన్ వస్తూనే ఉంది. పోతూనే ఉంది. మనమంతా రోజాలు పాటిస్తున్నాం, తరావీలు ఆచరిస్తున్నాం. ఖురాన్ పారాయణం

చేస్తున్నాం. రాత్రి జాగారాలు చేస్తున్నాం. సదఖ, ఫిత్రా, జకాత్ తదితర రూపాల్లో అభాగ్యులు, అగత్యపరులు, పేదవర్గాలను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నాం. నియమానుసారంగా, సాంప్రదాయబద్ధంగా అన్ని విధులూ నెరవేరుస్తున్నాం. నియమ నిష్ఠలతో నెల్లాళ్ళు తర్ఫీదును పొందుతున్నాం. అయితే రమజాన్ అనంతరం ఈ శిక్షణ ప్రభావం ఎంతవరకు కనబడుతోందన్నది ప్రశ్న. ఈద్ ముగియడంతోనే శుభాల పర్వానికి తెరపడకూడదు. రమజాన్ నెల్లాళ్ళూ మస్జిదులు ఏ విధంగా కళకళలాడాయో, అలాగే రమజాన్ తరువాత కూడా నమాజీలతో కళకళలాడేలా చూడాలి. రమజాన్ లో కనిపించిన సేవాభావం, దాతృస్వభావం, న్యాయబద్ధత, ధర్మశీలత, వాగ్దానపాలన, ప్రేమ, సోదరభావం, సహనశీలత, పరోపకారం, క్షమ, జాలి, దయ, త్యాగభావం రమజాన్ అనంతరమూ ఆచరణలో ఉండాలి. అసత్యం, అబద్ధం పలకకపోవడం, అశ్లీలానికి పాల్పడక పోవడం, చెడు వినక పోవడం, చూడకపోవడం, సహించక పోవడంతోపాటు, అన్ని రకాల దుర్గుణాలకు దూరంగా ఉండే సుగుణాలు నిరంతరం కొనసాగాలి. తొలకరి జల్లుతో బీడువారిన పుడమి పులకించినట్లు, రమజాన్ వసంతాగమనంతో నైతిక వర్తనంలో, ఆధ్యాత్మిక ప్రగతిలో గణనీయమైన వృద్ధివికాసాలు జరిగాయి. అనూహ్యమైన మానవీయ పరివర్తనకు బీజం పడింది. ఇప్పుడది నిలబడాలి, నిరంతరం కొనసాగాలి. ఈ శుభాలు, వృద్ధివికాసాలు ఒక్క నెలకే పరిమితం కాకూడదు. మనిషిని మనీషిగా మార్చడానికే ఈ శిక్షణకు ఏర్పాటుచేసింది ఇస్లాం. నిజానికి ఇస్లాం బోధనలు చాలా సరళం, సంపూర్ణం, సమగ్రం, స్పష్టం, స్వచ్ఛం, నిర్మలం. మానవులు వీటిని ఆచరిస్తే, అనుసరిస్తే నైతిక, ఆధ్యాత్మిక, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నిటినీ సమన్వయ పరచగలరు. వీటి మధ్య ఒక సమతుల్యతను సాధించగలరు. ఈ రంగాలన్నింటా దైవాభీష్టానికి అనుగుణంగా నడుచుకోవడంద్వారా ప్రతి పనినీ ఆరాధనగా మలచుకోగలరు. మానవుల ప్రతి పనినీ ఆరాధనా స్థాయికి చేర్చిన ధర్మం ఇస్లాం. అందుకే పవిత్ర రమజాన్ నెలలో వారి శిక్షణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది ధర్మం. ఇక దాన్ని సద్వినియోగం చేసుకోవడమైనా, దుర్వినియోగం చేసుకోవడమైనా మన చేతుల్లోనే ఉంది. అందుకని రమజాన్ స్ఫూర్తిని కొనసాగించాలి. అప్పుడే రోజాల ఉద్దేశ్యం నెరవేరుతుంది. పండుగ ఆనందానికి పరమార్థం చేకూరుతుంది. భావిజీవితాలు సుఖసంతోషాలతో గడిచి పోతాయి. సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరుస్తుంది. దోపిడీ, పీడన, అణచివేత, అసమానతలు లేని చక్కని ప్రేమపూరితమైన సుందర సమాజం ఆవిష్కృతమవుతుంది. ✦

# గూటిలో దీపం

ఓ జీవితం చాలదు
గుండె హాహాకారం
ప్రభావశీలమయి
నీకు అందే వరకు

ఎవరు బతికేరు
నీ కురుల చేరువయి
నీ పొందు కాస్తా
పొందే వరకు!

ఏమరుపాటుకు
ఏ మాత్రం
గురి కావన్నది
నిజం సమ్మతమే

మారి పోతాము
ధూళి ధూళీగా
కబురు నీకు
అందే వరకు

ఒక్క మరణం తప్ప–
ఏముందీ ఎవరయినా
చేయదగ్గ చికిత్స –
జీవన ఆవేదనకు?

ఎన్నుయినా వన్నెలలో
వెలుగుతూనే ఉంటుంది
గూటిలో దీపం
తెల్లవారు సందె వరకు!

**– గాలిబ్, మలిక్**

25–3–25

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**37 ఆయత్‌లు**

# 45. అల్ జాసియ

**మక్కా అవతరణ**

21 – 22 ఏమిటీ, ఎవరయితే చెడులకు పాల్పడ్డారో వారు, మేము వారినీ మరి విశ్వసించి సదాచరణ చేసే వారినీ ఒకేలా చేసి వారి జనన మరణాలు సమానమయ్యేలా చేసివేస్తామని అనుకుని ఉన్నారా? చాలా చెడ్డ తీర్పులు వీరు చేస్తూ ఉన్నవి.[27] అల్లాహ్ అయితే ఆకాశాలనూ, భూమినీ ధర్మబద్ధంగా సృష్టించాడు,[28] అలా చేసింది, ప్రతి ప్రాణికి అతని సంపాదన ప్రకారం ప్రతిఫలాన్ని ఇవ్వాలని. జనులకు ఎంతమాత్రం అన్యాయం చెయ్యడం జరగదు. [29]

27. ఇది పరలోకం సత్యబద్ధం అని అనడానికి నైతిక ఆధారం. నైతికతలో మంచీ చెడులు, ఆచరణల్లో సత్క్రియలు, దుష్క్రియలు అనే వ్యత్యాసం ఉందని అంగీకరిస్తే దానికి తప్పనిసరి ఆవశ్యకత, మంచి వ్యక్తీ, చెడ్డ వ్యక్తుల అంతిమ పరిణామం ఒకే విధంగా రూపొందకూడదు అన్నది. మంచివారికి, వారి మంచితనానికి మంచి ప్రతిఫలం ప్రాప్తమవ్వాలి. చెడ్డవారు తమ చెడుకు చెడ్డ ప్రతిఫలాన్ని పొందాలి. ఇలా జరగకపోయినట్లయితే సత్కార్యాలూ దుష్కార్యాల పర్యవసానం ఒకేవిధమయిన దయినట్లయితే అసలు నైతికతలో మంచీ చెడుల వ్యత్యాసమే అర్థరహితమయిపోతుంది, దైవం అన్యాయం చేసిన ఆరోపణ విధితమవుతుంది. ప్రపంచంలో దుష్టమార్గాన్ని అవలంబించేవారు, ఎటువంటి బహుమాన మయినా, మరే శిక్ష అయినా దొరకరాదనే కోరుకుంటారు. ఈ భావనే వారి విలాసాలకు బాధ కలుగజేస్తుంది. కాని విశ్వప్రభువు విజ్ఞత, ఆయన న్యాయశీలతకు ఇది సుదూరమయిన విషయం. ఆయన మంచి వ్యక్తులు, చెడ్డ వ్యక్తులతో ఒకేవిధంగా ప్రవర్తిం చడం, సజ్జనుడయిన విశ్వాసి ప్రపంచంలో ఏ విధంగా జీవితం గడిపాడో, తిరస్కారి, పాపభూయిష్టమయిన జీవితం గడిపినవాడు ఇక్కడ ఎటువంటి వేషాలు వేస్తూ ఉన్నాడో ఆయన చూడకుండానే వ్యవహరించడం అన్నది అసలు కాని పని. ఒక వ్యక్తి జీవితాంతం తనపైన నైతికతా ప్రతిబంధకాలు విధించుకుని జీవించాడు. ఎవరి హక్కులు వారికి అందజేస్తూ వచ్చాడు. అధర్మమయిన ప్రయోజ నాలు, రుచుల నుండి దూరంగా మెలిగాడు. సత్యం, సత్యతల కోసం రకరకాల నష్టాలను భరిస్తూ వచ్చాడు. మరో వ్యక్తి తన వాంఛల్ని సాధ్యమయినన్ని విధాలా నెరవేర్చుకున్నాడు. దేవుని హక్కు గుర్తించలేదు, దాసుల హక్కునూ కాజేయకుండా వదలలేదు. ఎన్ని విధాలుగా లాభాలు, రుచులు ప్రోగుచేసుకో గలిగితే అన్ని విధాలా చేసుకుంటూ పోయాడు. ఈ రెండు రకాల మనుషుల జీవితంలోని ఈ వ్యత్యాసాన్ని ఉపేక్షిస్తాడని దైవం విషయంలో ఆశించడం సాధ్యమేనా? మరణ ఘడియవరకు ఎవరెవరి బ్రతుకులు ఒకేలా సాగలేదో మరణం తరువాత వారి పరిణామ ఫలం ఒక్కటే అయినట్లయితే దేవుని దైవత్వంలో ఇంతకన్నా అన్యాయం మరొకటి ఏది కాగలదు? (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, యూనుస్: పాద సూచి 106 సం.4, అన్ నహ్ల్: పాదసూచి 35 సం.5, అల్ హజ్జ్ : పాద సూచి 9 అన్ నమ్ల్ : పాదసూచి 86 సం.6, అర్ రూమ్ : పాదసూచికలు 6 – 8 సం.7, సాద్: ఆయత్ 28, పాదసూచి 30).

28. అంటే, పరమ ప్రభువు అల్లాహ్ భూమీ ఆకాశాల సృష్టి ఏదో ఆటగా చేయలేదు. అదొక లక్ష్యపూర్వకమయిన, విజ్ఞతా పూర్వకమయిన వ్యవస్థ. ఈ వ్యవస్థలో, అల్లాహ్ ఇచ్చిన అధికారాలను, సాధనా సంపత్తులను సరయిన రీతిలో వినియోగించుకుని సత్కార్యాలాచరించినవారు, ఇంకా వాటిని తప్పుడు రీతిలో వినియోగించుకుని ఇతర జనులపైన అన్యాయాలు, అత్యాచారాలు జరిపినవారు ఈ రెండు విధాల మానవులు చివరికి మరణించి మట్టి అయిపోవడం, ఈ మరణం తరువాత మరో జీవితం లేకపోవడం, అందులో న్యాయం రీత్యా వారి మంచీ చెడు ఆచరణలకు మంచీ చెడు ఫలితాలు వెలువడకపోవడం ఊహింపరాని విషయం. ఇలా జరిగినట్లయితే ఈ జగతి ఒక అల్లరిపిల్లవాని ఆట వస్తువయిపోతుంది. ఇది విజ్ఞుడయిన వాని లక్ష్యపూర్వకమయిన వ్యవస్థ కాజాలదు. (మరిన్ని వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ ఆమ్: పాద సూచి 46 సం.3, యూనుస్ : పాద సూచి 11 సం.4, ఇబ్రాహీమ్: పాదసూచి 26 అన్ నహ్ల్: పాద సూచి 6 సం.6, అన్కబూత్: పాద సూచి 75 అర్ రూమ్: పాదసూచి 6).

29. ఈ పూర్వాపరాలలో ఈ వాక్యం వల్ల ముందుకు వచ్చే స్పష్టమయిన భావం, మంచి వ్యక్తులకు వాళ్ళ మంచితనానికి ప్రతిఫలం దొరక్కపోవడం, దుర్మార్గులకు వారి దుర్మార్గానికి శిక్ష పడకపోవడం బాధితుల గోడు వినే అవకాశమే కలగకపోవడం అన్యాయం, అధర్మం. దేవుని దైవత్వంలో ఇలాంటి అక్రమం జరగడానికి ఎంతమాత్రం వీలులేదు. అదేవిధంగా దైవం వద్ద అన్యాయానికి మరో రూపం సంభవించడానికి కూడా ఆస్కారం లేదు – ఒక సజ్జనునికి అతని హక్కుకన్నా తక్కువ ప్రతిఫలమివ్వడమో లేదా దుష్ట వ్యక్తికి విధించే శిక్షకన్నా అధికంగా విధించడమో ఎన్నటికీ జరగరాదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## నజ్రాన్ క్రైస్తవుల వృత్తాంతం

**239)** హుజైఫా(రజి) కథనం: నజ్రాన్‌కు చెందిన ఆఖిబ్, సయ్యిద్ అనే ఇద్దరు నాయకులు ప్రవక్త మహనీయులు (సఅసమ్)తో 'ముబాహిలా' చేయడానికి వచ్చారు. కాని వారిద్దరిలో ఒకడు రెండవ వానితో, "అలా చేయకు. ఎందు కంటే దైవసాక్షిగా! ఒకవేళ ఈయన గారు నిజంగానే దైవప్రవక్తే అయి ఉన్నప్పటికీ మనం ఆయనతో 'ముబాహిలా' జరిపితే, మనం బ్రతికి బట్టకట్టజాలము. మన సంతానం కూడా మిగిలి ఉండదు"[1] అని హెచ్చరించాడు. తరువాత వారిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, "మీరు అడిగినంత జిజ్‌యా ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మీరు మా వద్దకు నిజాయితీపరుడైన ఒక అధికారిని పంపించండి. మీరు ఎవరిని పంపినా అతను నిజాయితీపరుడై ఉండాలి" అని ప్రతిపాదించారు. సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "నేను మీ వద్దకు ఒక వ్యక్తిని పంపుతాను. అతను పూర్తిగా నిజాయితీపరుడు, నమ్మకస్థుడు అయి ఉంటాడు"[2] ప్రవక్త ప్రియ సహ చరులు దైవప్రవక్త(స) నిర్ణయం కొరకు ఎదురు చూశారు. అప్పుడాయన(స), "అబూ ఉబైదా బిన్ జర్రాహ్! లే" అన్నారు. ఆయన లేచి నిలబడినప్పుడు, "ఇతను ఈ ఉమ్మత్‌కు చెందిన నిజాయితీపరుడు (అమీన్)" అని పలికారు.

**240)** అబూ హుజైఫా(రజి) తెలిపారు: నజ్రాన్ వాసులు ప్రవక్త మహనీయుల(సఅసమ్) సమక్షంలోకి వచ్చి, 'మా వెంట నిజాయితీపరుడైన ఒక మనిషిని పంపించండి' అని కోరారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "నేను మీ వెంట సర్వ విధాలా నిజాయితీపరుడు, నమ్మకస్థుడైన ఒక వ్యక్తిని పంపిస్తాన"ని అన్నారు. ఆ వ్యక్తి ఎవరోనని సహచరమాన్యులు ఉత్సుకతతో ఎదురు చూశారు. దైవప్రవక్త(స) అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి)ను పంపారు.[1]

239-1. మహాప్రవక్త(స) నజ్రాన్ ప్రముఖులకు హితబోధ చేశారు. వారికి ఇస్లామ్ సందేశం అందజేశారు. కాని వారు అంగీకరించ లేదు సరికదా తమ మాటపై హఠం చేశారు. అప్పుడు దైవ ప్రవక్త(స), "సరే. అలాగైతే రండి, మనం 'ముబాహిలా' చేద్దాం" అని సవాలు విసిరారు.

'ముబాహిలా' అంటే ఇరువర్గాల వారు సంవాదన జరిపి, తాము మాత్రమే సత్యంపై ఉన్నామని పట్టుబట్టినప్పుడు, రెండు వర్గాల మధ్యన విభేదం తీవ్రస్థాయికి చేరినప్పుడు, ఆ ఇరు వర్గాల వారు దైవ సమక్షంలో ప్రార్థించాలి - 'దేవా! మాలో ఎవరు అసత్యంపై మొండికేశారో వారిపై నీ శిక్షను అవతరింపజెయ్యి' అని వేడుకోవాలి.

239-2. చివరకు నజ్రాన్ క్రైస్తవులు రాజీకి వచ్చారు. అంటే తాము సత్యంపై లేమన్న విషయాన్ని పరోక్షంగా అంగీకరిం చారు. ఇస్లామీయ రాజ్యానికి కప్పం చెల్లించడానికి ఒప్పు కున్నారు. దైవప్రవక్త(స)తో వారు చేసుకున్న సంధి ప్రకారం రజబ్ నెలలో వెయ్యి జతల బట్టలు, సఫర్ నెలలో వెయ్యి జతల దుస్తులు ఇచ్చుకోవాలి, ప్రతి జతతో పాటు ఒక ఊఖియా వెండి కూడా ఇవ్వాలి.

ఈ క్రైస్తవ బృందం వచ్చినప్పుడే దైవప్రవక్త 'మస్జిదె నబవీ'లో సగం స్థలాన్ని ఖాళీ చేయించి, క్రైస్తవులకు వారి పద్ధతి ప్రకారం దైవారాధన చేసుకునే సౌకర్యం కల్పించారు. ప్రవక్త(స)వారి పరమత సహనానికి ఇంతకన్నా ప్రబల తార్కాణం ఇంకేం కావాలి.

మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి) విశిష్టత కూడా ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

240-1. హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) స్వర్గలోక శుభవార్త అందుకున్న పది మంది సహాబాలో ఒకరు. ముస్లిం సముదాయపు 'అమీన్' (నిజాయితీపరుడు)గా ఖ్యాతి గడిం చారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్(రజి)తో పాటే ఇస్లామ్ స్వీకరించారు. రెండు హిజ్రత్‌లు చేసిన ఘనత ఈయనకు దక్కింది. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా శిరస్త్రాణంలోని రెండు కొక్కెములు దైవప్రవక్త(స) దవడలో గుచ్చుకున్నప్పుడు, ఈయన తన పళ్లతో వాటిని బయ టకు లాగారు. దాంతో ఆయన పల్లు రెండు రాలిపోయాయి. పొడుగరి. సుందర స్వరూపులు. అమ్‌వాస్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి వాతన పడి హిజ్రీ 18వ సంవత్సరంలో మరణించారు. అప్పటికి ఆయనకు 58 సంవత్సరాలు.

# ఈజిప్టు పరిస్థితులు, టర్కీ అనుభవాలు - గుణపాఠాలు



మూడవ భాగము

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం “ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్” నుంచి....)**

**ఈ వ్యాసంలో** ఈజిప్టు, అరబ్బు పరిస్థితుల మూల్యాంకనం చేయడం జరుగుతుంది. ప్రత్యేకించి ఇస్లామీ ఉద్యమాలు వాటి జయాపజయాలను సమీక్షించడం జరుగుతుంది. ఈ సమీక్షను కేవలం మన వివేకవంతమైన ఆచరణాత్మక అంశాలకు మాత్రమే పరిమితం చేస్తాను. ఇన్షా అల్లాహ్ ఈ సమీక్షలో కొన్ని ఆచరణాత్మక సూచనలు కూడా మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను. ఈ వ్యాసంలో ఎక్కువగా ఈజిప్టు దేశ పరిస్థితులను సమీక్షించడంపై దృష్టిపెట్టడం జరిగింది. ఈ పరిస్థితులను టర్కీ అనుభవాలతో అనుసంధానించడం జరిగింది. ఎందుకంటే టర్కీలో ఇస్లామీ శక్తులు సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగుతూ ఉన్నాయి. విజయవంతంగా ముందుకు సాగుతూ ఉన్నాయి. అంతేకాదు ఇస్లామీయ లక్ష్యం వైపుకు శీఘ్రంగా, త్వరిత గతిలో పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ముందుకు విజయవంతంగా సాగుతున్నట్లు కనపడుతుంది.

ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్క దేశం, దాని పరిస్థితులు ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంటాయి. టర్కీ అనుభవాలను మక్కీకి మక్కీగా ఈజిప్టులో అమలు చేయలేము. వాస్తవ **ఈ వ్యాసంలో** ఈజిప్టు, అరబ్బు పరిస్థితుల మూల్యాంకనం చేయడం జరుగుతుంది. ప్రత్యేకించి ఇస్లామీ ఉద్యమాలు వాటి జయాపజయా లను సమీక్షించడం జరుగుతుంది. ఈ సమీక్షను కేవలం మన వివేకవంతమైన ఆచరణాత్మక అంశాలకు మాత్రమే పరిమితం చేస్తాను. ఇన్షా అల్లాహ్ ఈ సమీక్షలో కొన్ని ఆచరణాత్మక సూచనలు కూడా మీ ముందుంచే ప్రయత్నం చేస్తాను. ఈ వ్యాసంలో ఎక్కువగా ఈజిప్టు దేశ పరిస్థితులను సమీక్షించడంపై దృష్టిపెట్టడం జరిగింది. ఈ పరిస్థితులను టర్కీ అనుభవాలతో అనుసంధానించడం జరిగింది. ఎందుకంటే టర్కీలో ఇస్లామీ శక్తులు సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగుతూ ఉన్నాయి. విజయవంతంగా ముందుకు సాగుతూ ఉన్నాయి. అంతేకాదు ఇస్లామీయ లక్ష్యం వైపుకు శీఘ్రంగా, త్వరిత గతిలో పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ముందుకు విజయవంతంగా సాగుతున్నట్లు కనపడుతుంది.

ఈ ప్రపంచంలోని ప్రతి ఒక్క దేశం, దాని పరిస్థితులు ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంటాయి. టర్కీ అనుభవాలను మక్కీకి మక్కీగా ఈజిప్టులో అమలు చేయలేము. ఈ వాస్తవ చైతన్యంతో గమనిస్తే ప్రపంచం మొత్తంగా నేడు ఒక గ్లోబల్ విలేజ్‌గా ఉంది. సారూప్యతలు కలిగిన సమస్యలు కూడా అనేకం ఉన్నాయి. ప్రతి దేశంలోని అనుభవ జ్ఞానం, మరో దేశంలోని ఉద్యమాలకు గుణపాఠాలు గానూ, అనుభవాలుగానూ ఉపయోగపడతాయి. ఈ వ్యాసంలో ఆ సారూప్యతలు గల సార్వజనీన అంశాలనే ప్రస్తావించడం జరుగుతుంది.

మధ్య ప్రాచ్య అరబ్బు భూభాగంపై అంతర్జాతీయ శక్తులు అమితమైన శ్రద్ధను కనపర్చడం నేడు తెలియని విషయం కాదు. ఇందుకు కారణం కూడా విస్పష్టమే. అక్కడి అపారమైన చమురు నిల్వలు, ఇజ్రాయీల్ దేశపు ఉనికి, దాని శ్రేయం, దాని భౌగోళిక ప్రాధాన్యతను ఇస్లామీయ ప్రపంచంపై రుద్దడం. ఈ ప్రాంతమే ఇస్లాంకు కేంద్రకంగా పని చేస్తూ ఉండటం. ఈ కారణంగానే అంతర్జాతీయ ఆధిపత్య శక్తులు, అమెరికా, యూరప్ దేశాల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలతో ముడిపెట్టి అక్కడ తన క్రూరమైన ప్రయోగాలను కొనసాగిస్తున్నాయి.

టర్కీ, ఈజిప్టు, ఇంకా ఈరాన్ మధ్యప్రాచ్యపు మూడు ప్రధానశక్తులు. ఈ మూడు దేశాలు మూడు విభిన్న దిక్కులలో ఉన్నాయి. ఈ మూడు దేశాలు యూరప్, ఆసియా, ఆఫ్రికా ఖండాలను కలుపుతూ భౌగోళికంగా అత్యంత కీలకస్థానాలలో ఉన్నాయి. జనాభా, వైశాల్యం, విద్య, వైజ్ఞానిక రంగాలలోనూ, మరి ఇతర అనేక అంశాలలోనూ మధ్యప్రాచ్యంలో ఈ దేశాలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ ఆధిపత్య శక్తులు మధ్యప్రాచ్యంపై ఆధిపత్యం వహించేందుకు స్ట్రాటజికల్‌గా ఈ మూడుదేశాలు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్ దేశపు ఆధిపత్యం నెలకొల్పేందుకు అంతర్జాతీయ ఆధిపత్య శక్తులకు ఈ మూడుదేశాలు ఆటంకాలుగా, కంటక ప్రాయంగా ఉన్నాయి. ఈ కారణంగానే గతం నుండి ఈ మూడు దేశాల నుండి కనీసం రెండు దేశాలను ఇజ్రాయిల్ సమర్ధకులుగా ఉంచేందుకు ప్రయత్నాలు సాగుతూ ఉండేవి. మధ్యప్రాచ్య – చరిత్ర మొత్తంగా ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. (మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రత్యేకించి ఈ పని ప్రారంభమయ్యింది) ఇజ్రాయిల్ దేశం ఏర్పడినప్పటి నుండి టర్కీ, ఈరాన్ దేశాలు దాని ప్రధాన సమర్ధకులుగా ఉండేవారు. ఈరాన్‌లో ఇస్లామీయ విప్లవ పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆ దేశం ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా మారినప్పుడు అమెరికా క్యాంప్ డేవిడ్ ఒప్పందంద్వారా ఈజిప్టును స్వంతం చేసుకొంది. దానిని ఇజ్రాయిల్ సమర్ధకుని స్థానం నుండి బానిసదేశ స్థానానికి దిగ జార్చింది. గత డెబ్బై ఏండ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా ఈ మూడు దేశాలు ఇజ్రాయిల్‌కు వ్యతిరేక దేశాలుగా నిలిచాయి. దాని ఆధిపత్యాన్ని సవాలు చేసే స్థాయికి ఎదిగాయి.

ఈ మూడు దేశాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, మనం ఈజిప్టులో సంభవిస్తున్న రాజకీయ పరిణామాలను అర్ధం చేసుకోవాలి. అదే సమయంలో ఈజిప్టు పరిస్థితులను అర్ధం చేసుకునేందుకు, మిగిలిన రెండు దేశాలలో జరిగిన రాజకీయ గుణాత్మక మార్పులను కూడా అధ్యయనం చేసి తీరాలి. ప్రస్తుతం ఈజిప్టులో ఇఖ్వానుల్ ముస్లిమీన్, ముహమ్మద్ మోర్సీ పట్ల జరుగుతున్న తీవ్రమైన నిర్బంధాన్ని, అణచివేతను ఈ నేపథ్యంలోనే స్పష్టంగా అర్ధం చేసుకోగలం. ఈరాన్, టర్కీ దేశాలలో సంభవించిన రాజకీయ విప్లవాల ఫలితమే ఈజిప్టు నిర్బంధం అని గుర్తించాలి.

1979 ఈరాన్‌లో సంభవించిన మహత్తర ఇస్లామీయ విప్లవానికి చాలా ముందు 1951లో ముహమ్మద్ మజ్దక్ ఈ దేశానికి మొట్ట మొదటి ప్రజాస్వామిక ప్రధానమంత్రిగా నియమించబడ్డాడు. ఈయన స్వయానా ఒక గొప్ప మేధావిగా గుర్తింపు పొందాడు. కేవలం రెండేళ్ళ కాలంలో ఈయన అనుసరించిన విధానాల కారణంగా దేశ ఆర్ధిక, సామాజిక పరిస్థితుల్లో పెనుమార్పులు సంభవించాయి. ఆయన ప్రధాన నిర్ణయాలలో అత్యంత ముఖ్యమైనది, ఇరాన్ చమురు నిక్షేపాలన్నింటిని జాతీయ సంపదగా మార్చటం. ఈ చమురు కేంద్రాలు అన్ని మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు నుండి బ్రిటన్ కబంధహస్తాలలో ఉండేవి. బ్రిటన్‌కు చెందిన ఆంగ్లో పర్షియన్ ఆయిల్ కార్పోరేషన్ (APOC పిదప బ్రిటిష్ పెట్రోలియం BPగా పిలవబడింది) ఈ నిల్వలపై ఆధిపత్యం కలిగి ఉండేది. ఈరాన్ ఈ చమురు నిక్షేపాలను జాతీయ సంపదగా ప్రకటించడం ఈరాన్ ఆర్ధికస్వేచ్ఛకు బలం చేకూర్చగా, అంతర్జాతీయ పెట్టుబడి దారీ ఆధిపత్య శక్తులకు శరాఘాతమయ్యింది. ఈ ప్రధాన నిర్ణయం ఈరాన్ అభివృద్ధికి బలమైన పాదముద్రలు వేసింది.

దీని ఫలితం ఏమైంది? కేవలం రెండేళ్ళ కాలంలోనే అమెరికా CIA, బ్రిటన్ MI6 పేర్లుగల గూఢచారి సంస్థలు తమకుట్రలు మొదలెట్టాయి. సైన్యం, ప్రసార మాధ్యమాలు, బ్యూరోక్రసీ, న్యాయస్థానాల మద్దతుతో తమ కీలుబొమ్మ జనరల్ ఫజలుల్లాహ్ జాహిదీ ఇరాన్ పాలకునిగా నియమింపబడ్డాడు. ఈయన బ్రిటన్‌కు నమ్మినబంటు లాంటివాడు. పెట్టుబడిదారుల ముద్దుబిడ్డ. ముహమ్మద్ మజ్దక్ వంటి మేధావి ప్రధానమంత్రిని రెండేళ్ళ జైలుకు, ఆపై పదకొండేళ్ళ గృహ నిర్బంధంలోనూ ఖైదుచేశారు. ఈ గృహ నిర్బంధంలోనే 1967లో ఆయన తన అంతిమ శ్వాసవదిలారు. ఈ వార్తను బయట ప్రపంచానికి తెలియపర్చకుండానే నిశ్శబ్దంగా ఆయన గృహంలోనే సమాధి చేయడం జరిగింది. (Mossadegh; a Political Biography, Routledge Kegan and Poul - London 1986. By Farhad Diba)

ఇదే విధంగా టర్కీలోనూ 1960లలో ఇస్లాం అభిమాని, జాతీయ వాది అయిన ప్రధానమంత్రి అద్‌నాన్ మెందరీస్‌ను పదవీచ్యు తుడిగా చేయడమేకాక, ఆయనను ఉరికంభం ఎక్కించారు. నజముద్దీన్ అర్‌బకాన్ ఒకసారి ఉప ప్రధానిగానూ, రెండు సార్లు ప్రధాన మంత్రిగానూ నియమించబడ్డాడు. ప్రతిసారి ఒక సంవత్సర కాలంలోనే పదవీచ్యుతులు చేయబడేవారు. ఈరాన్ లాగానే ఇక్కడ కూడా సైనిక జోక్యం, సైనిక తిరుగుబాటు జరిగేది. ప్రధానమంత్రి స్థానంలో

సైనిక జనరల్ లేక వారి కీలుబొమ్మలు అధికారాన్ని చలాయించే వారు. ఈ మార్పులకు కుట్రలకు నేడు Deep Stateగా పిలబడు తున్న శక్తియే కారణంగా ఉండేది. ఈ శక్తియే టర్కీలోని మొత్తం వ్యవస్థలను ఆజమాయిషీ చేసేది. మొత్తం వ్యవస్థలను తన కంట్రోలులో ఉంచుకొని ఉండేది. ఈ శక్తియే కులీన వర్గాలకు ప్రతినిధిగా వ్యవహరించేది. (www.britannica.com/ bio graphy/ adnan menderes; retrived on 30.12.2017)

ఆ తర్వాత పరిణామాలేమిటి? ఈ రెండు దేశాలలోని ఇస్లామీయ ఉద్యమాలు ప్రథమంగా ప్రజలను ప్రభావితపర్చాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ఆధిపత్యశక్తులు కొనసాగించనివ్వలేదు. అయితే, ఇస్లామీయ ఉద్యమాలు సహనంతో తమ పని తాము చేసుకుంటూ ముందుకుసాగాయి. ప్రజలతో పాటు కులీనవర్గాలను సైతం ఈ ఉద్యమాలు ప్రభావితం చేశాయి. ఆ పిదప జరిగిన మార్పులకు ఈ వర్గాల ప్రతినిధి డీప్ ఎస్టేట్‌ల మద్దతు కూడా లభించింది. ఈరాన్‌లో ఇలాగే జరిగింది. పిదప ప్రజా నాయకత్వా నికి ఈ 'డీప్‌స్టేట్'లపై నియంత్రణ లభించింది. ఇదే పరిణామం టర్కీలోనూ జరిగింది. ఈ విధానమే ఇప్పుడు ఈజిప్టులో అమలు కావలసి ఉంది. ఈ మార్పుల ప్రారంభం ఇరాన్‌లో 1951 ముహమ్మద్ మజ్దక్ నుండి ప్రారంభమై 1979లోని ఇస్లామీయ విప్లవంతో సంపూర్ణమయ్యింది. అదే క్రమం టర్కీలోనూ 1960లో అద్‌నాన్ మెందరిస్ ఉరితో ప్రారంభమై 1997లో యూసుఫ్ మాదరన్ విద్రోహం, అర్బగాన్ రాజీనామాలతో ప్రారంభమై 2001 లో తయ్యిబ్ ఉర్దగాన్ నియామకంతో సంపూర్ణమయ్యింది. ఈరాన్‌లో 27 సంవత్సరాలు, టర్కీలో 41 సంవత్సరాలు పట్టిన ఈ కాల పరిణామం, అన్ని ప్రాంతాలల్లోనూ తప్పనిసరికాదు. ఈజిప్టులో కూడా ఇదే మార్పు, త్వరలో సంభవించే వాతావరణం నేడు నెలకొని ఉంది. ఇన్షా అల్లాహ్ ఈ మార్పుకు అవసరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అయితే అంతర్జాతీయ ప్రతీఘాతుక శక్తులు, ఇస్లామీయ విప్లవాన్ని నిరోధించేందుకు నిత్యం కృషిచేస్తూనే ఉంటాయి. కుట్రలు – కుతంత్రాలు పన్నుతూనే ఉంటాయి. ఇందుకు వారు బలమైన, శక్తివంతమైన ప్రణాళికలు రచిస్తూ వాటిని అమలు చేస్తారు కూడా. గత చరిత్ర, ప్రస్తుతం నడుస్తున్న చరిత్ర ఇందుకు సాక్ష్యాలుగా ఉన్నాయి. రానున్న వాక్యాలలో ఈ ప్రణాళికల గురించే ఎక్కువ చర్చ జరగబోతుంది. ఈ అంతర్జాతీయ ఇస్లాం వ్యతిరేక శక్తుల పథకాలు ఏవి? వారు వాటిని ఎలా అమలు చేస్తారు? అనే అంశా లనే చర్చ ఉంటుంది. ఈ అంశాల ఆధారంగా ప్రత్యేకించి ఇఖ్వాన్ ఆచరణపై కూడా సమీక్ష చేయడం జరుగుతుంది. వాటిని టర్కీ ఆచరణతో పోల్చి అధ్యయనం చేయడం కూడా జరుగుతుంది.

## 1) కులీన వర్గాలపై నియంత్రణ:

ప్రప్రథమ వివేకవంతమైన ఆచరణలో ప్రథమ స్థానం కులీనవర్గాలు లేక సమాజంలో ప్రభావశీల వర్గాలు అయిన 'డీప్‌స్టేట్'లను కంట్రోల్ చేయడం. ఈ వర్గాలను అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు తమ కీలుబొమ్మ ప్రభుత్వాల ద్వారా నియంత్రిస్తాయి. సదరు వర్గాల ద్వారా తమ కీలుబొమ్మ ప్రభుత్వాధినేతను ఆడిస్తాయి. అధికారాన్ని ఒక వ్యక్తికి సుదీర్ఘకాలం ఇవ్వకుండా నిరంతరం మారుస్తూ ఉంటాయి. షాహ్‌ఫైసల్ రహ్మా, జనరల్ జియా వంటి వ్యక్తుల ప్రమాదాన్ని ఈ శక్తులు ప్రతినిత్యం శంకిస్తూనే ఉంటాయి. ఈ డీప్‌స్టేట్‌లోని ప్రధాన భాగంలో మిలటరీ అధికారులు, ఉంటారు. తరువాత, కార్య నిర్వాహక ప్రభుత్వ బ్యూరో క్రసీ ఉంటుంది. న్యాయవ్యవస్థ, మీడియా, మేధావులు, కులీనులు ఈ స్టేట్‌లో ప్రధాన భాగస్వాములుగా ఉంటారు. వీరికి నిత్యం అత్యంత గౌరవంగా శిక్షణ ఇవ్వడం జరుగుతూ ఉంటుంది. వీరిని ప్రజలతో సత్ సంబంధాలు కలిగి ఉండనివ్వని సామాజిక పరిస్థితులను కల్పిస్తారు. ప్రజల పట్ల నిత్యం హీనమైన భావనలు కలిగి ఉండేలా తర్ఫీదు ఇస్తారు. ప్రజల అభీష్టం వారి అవసరాలు, వీరికి నిత్యం కంటకాలుగానే కనిపించేలా చేస్తారు. వీరి ఆర్థిక ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలకు మధ్య కృత్రిమ పోటీని కల్పిస్తారు. ప్రజలను శత్రువులుగా చిత్రీకరించి వీరి ముందు ప్రదర్శిస్తారు. వీరిని తమ అంతర్జాతీయ దోపిడీకి అనుకూలురుగా, తమ ప్రయోజనాల నెరవేర్పుకు ఉపయోగపడే సాధనాలుగా మారు స్తారు.

'డీప్‌స్టేట్' పూర్తి స్థాయి ఆచరణను తెలుసుకునేందుకు ఈజిప్టు సైన్యాన్ని అర్థం చేసుకుంటే సరిపోతుంది. ఈజిప్టు సైన్యం ప్రపంచంలో ఎనిమిదవ స్థానం కలిగి ఉంది. ఇజ్రాయిల్ సైన్యంకంటే కూడా 2 1/2 శాతం అధికం. కొన్ని ప్రత్యేకతల రీత్యా ఈజిప్టు సైన్యం చాలా శక్తివంతమైనదిగా పరిగణింబడుతుంది. (Credit Suisse:- The end of globalization or more multipolar word ; Credit Suisse Research Institute ; september - 2015) కాని, ఇన్ని ప్రత్యేకతలు, శక్తులు, సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఈజిప్టు సైన్యం ఇప్పటివరకు యుద్ధమైదానంలో ఎటువంటి విజయా లను, సాధించలేకపోయింది. ఇజ్రాయిల్‌తో జరిగిన ప్రతి యుద్ధం లోనూ అత్యంత అవమానకర ఓటములను చవిచూసింది. ప్రతిసారి పెద్ద సంఖ్యలో తన సైనికులను బలిపెడుతూ, లేక ఖైదులకు అప్ప గిస్తూ వచ్చింది. 'సీనా' పర్వత లోయలను ఈ ఓటమి ద్వారా అప్ప గింతలు చేసింది. ఇజ్రాయిల్ అనుమతి లేకుండా ఈ ప్రాంతంలో నేటికీ ఎవరూ అడుగు పెట్టలేని పరిస్థితి ఉంది. అన్నిటికంటె

**(మిగతా వచ్చే సంచికలో)**


'చరితార్థులు'-2



# అబ్దుర్ రహ్మాన్ రేయా

## (1885 -1960)

76




మాతృభూమిని వలస పాలకుల కబంధ హస్తాల నుండి విముక్తి కల్గించడానికి విప్లవోద్యమ బాట పట్టడం మాత్రమే కాకుండా, కార్మిక-కర్షక జనావళి సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పోరాడిన అబ్దుర్ రహ్మాన్ రేయా 1885లో ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జన్మించారు. ఆయన తండ్రి మియాఁ గులాం హైదర్ రోహేలా ప్రభుత్వ ఉద్యోగి. స్థానిక ఇస్లామీయ కళాశాలలో చదివిన అబ్దుర్ రహ్మాన్ సరిహద్దు ప్రాంతం పోలీసు విభాగంలో చేరారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఆరంభమైన 'హిజ్రత్ ఉద్యమం'లో పాల్గొనేందుకు 1920లో ఉద్యోగం వదలి జాతీయోద్యమ బాట పట్టారు. 'నౌజవాన్-ఏ-సర్‌హద్' పేరుతో విప్లవ సంస్థను ఏర్పాటు చేసిన అబ్దుర్ రహీం పోపల్‌జై ప్రబోధిస్తున్న స్వేచ్ఛాయుత-సామ్యవాద భావజాలంతో అబ్దుర్ రహ్మాన్ ప్రభావితులయ్యారు. జాతీయోద్యమంలో భాగంగా ప్రాంతీయ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ శాఖ, 'నౌజవాన్-ఎ-సర్‌హద్', 'నౌజవాన్ భారత్ సభ' సభ్యులుగా పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. 1930 ఏప్రిల్ 23న పెషావర్‌లోని ఖిస్సాఖాని బజార్‌లో సాగిన మారణకాండకు వ్యతిరేకంగా పోరుబాట పట్టిన ఆయన శాసనోల్లంఘన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా నిర్బంధానికి గురైనా గాంధీ - ఇర్విన్ ఒడంబడిక పర్యవసానంగా జైలు నుండి విడుదలయ్యారు. ఆయన విప్లవకర చర్యల మూలంగా ఆంగ్లేయాధికారుల ఆగ్రహానికి గురై మరోమారు రెండు ఏండ్ల పాటు జైలులో గడిపారు. ఆంగ్లేయుల క్రూర చర్యలను ఏ మాత్రం లెక్కపెట్టకుండా విప్లవోద్యమంలో భాగస్వాములవుతున్న ఆయన 'మజ్లూం దునియా', 'ఫిత్రా' అను పత్రికలను ప్రారంభించి ప్రభుత్వ దుశ్చర్యలను దుయ్యబట్ట సాగారు. 1940లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ రహస్యంగా కలకత్తా నుండి కాబూల్ చేరుకున్న సందర్భంగా ఆంగ్ల ప్రభుత్వం సాగించిన అరెస్టులు, హింసాకాండకు ఆయన కూడా గురయ్యారు. పలుమార్లు నిర్బంధాలు, నిషేధాలను ఎదుర్కొంటూ వచ్చిన అబ్దుర్ రహ్మాన్ 1942లో ముస్లిం లీగ్‌లో చేరారు. ఆంగ్లేయ ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టడంలో ఏ మాత్రం వెనుకాడని ఆయన, మాతృభూమికి స్వాతంత్ర్యం లభించాక ఎటువంటి అధికార పదవులను ఆశించకుండా ప్రజల పక్షంగా నిలబడ్డారు. అధికార, అనధికార ప్రతినిధుల అవినీతి, బంధుప్రీతి, అరాచకాలను బహిర్గతం చేస్తూ ప్రభుత్వాధినేతల ఆగ్రహానికి గురయ్యారు. 1958లో ప్రభుత్వం 'మజ్లూం దునియా' పత్రికను నిషేధించడం వలన కరపత్రాల ద్వారా ప్రజల కడగండ్లను ఏకరువు పెడుతూ, అకృత్యాలకు పాల్పడుతున్న ప్రభుత్వాధికారుల మీద చివరి వరకు అక్షర యుద్ధం సాగించిన అబ్దుర్ రహ్మాన్ రేయా 1960లో కన్నుమూసారు.

✤




9440241727


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

2

# కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం!



**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

గత సంచిక తరువాయి

### కుటుంబం గురించి కొందరి కాకి గోల

పరిమితికి మించి సంతానం కలిగితే కుటుంబంలో ఎన్ని సమస్యలు తలెత్తుతాయో అంతకంటే రెట్టింపు సమస్యలు దేశం విషయంలో కలుగుతాయి. ''మంది ఎక్కువైతే మజ్జిగ పలచన అవుతుంది'' అన్న వాదన వీరిది.

''పిండి కొద్దీ రొట్టె''. దేశంలో ఆహారోత్పత్తికి తగిన వనరులు లేనపుడు, ఉండటానికి తగిన వసతులు లేనపుడు, ఉద్యోగాలకి తగిన ఖాళీలు లేనపుడు, రోగులకి తగినన్ని మందులు లేనప్పుడు లెక్కకు మించి జనాభా విపరీతంగా పెరిగిపోతున్నప్పుడు సమస్యలు ఎదురవక ఏమవుతాయి? అందరికీ అన్ని సౌకర్యాలు ఒనగూర్చాలంటే కుదిరేపనా? ఇంకొందరి సందేహం.

నిజంగా- ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు.. సంతోషం వచ్చినా.. బాధ వచ్చినా.. కలిసే పంచుకునేవారు. రానురాను ఉద్యోగాలు, ప్రైవేసీ పేరుతో ఉమ్మడి కుటుంబాలు కాస్తా చిన్న కుటుంబాలుగా మారిపోయాయి. చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం అన్నట్టుగా జనాలు ఆలోచన మొదలు పెట్టారు. ఆ తర్వాత అసలు అత్తామామలను ఎక్కడో పెట్టి.. భార్యాభర్తలు మాత్రం లైఫ్‌ని ఎంజాయ్ చేసే కల్చర్ వచ్చింది. ఇప్పుడు ఇది కాస్త ఇంకా అధ్వాన్నంగా మారింది. అదే DINK లైఫ్‌స్టైల్.

### ఈ వికృతి వికారాలు ఎన్నో ఎన్నెన్నో...

DINK లైఫ్‌స్టైల్ అంటే.. Double Income No Kids. సంపాదన ఎక్కువే ఉండాలి.. కానీ పిల్లలు మాత్రం వద్దు అనే దుస్సంప్రదాయం. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి! భార్యా భర్తలుగా అన్యోన్యంగా ఉండటం ప్రకృతి. పిల్లాపాపలతో ఉండటం సంస్కృతి. ఒక్కరు ముద్దు ఇద్దరు వద్దు అనేది వికృతి. అసలు పిల్లలే వద్దనుకోవడం వినాశకర దుష్కృతి. ఆలుమగలు తమ ప్రైవేసీ కోసం ఇలాంటి పద్ధతిని పాటిస్తున్నారు. పిల్లలను కనకుండా దంపతులు బాగా డబ్బులు సంపాదిస్తారు. అంటే ఇద్దరి సంపాదన ఉంటుంది. తర్వాత వాటితో లైఫ్‌ని ఎంజాయ్ చేస్తారు. నచ్చిన ప్రదేశాలకు వెళ్తారు.. నచ్చిన తిండి తింటారు. అంటే ఇక వారి జీవితానికి వారే రాజు.. వారే రాణి అన్న భ్రాంతిలో బతుకుతుంటారు.

నిజానికి ఈ కాన్సెప్ట్ ఇతర దేశాల్లో 20వ శతాబ్దిలోనే మొదలైంది. కానీ భారత దేశం వంటి అనేక దేశాలతోపాటు అరబ్బు దేశాల్లోనూ ఇది యువ జంటలను చాలా వేగంగా ఆకర్షిస్తోంది. ఈ పద్ధతి ద్వారా పిల్లల మీద పెట్టే ఖర్చుతో జీవితాన్ని ఎంజాయ్ చేయ వచ్చని కొందరు అనుకుంటున్నారు. పిల్లలతో పడాల్సిన బాధలు ఏవీ ఉండవని అనుకుంటారు. ఇందుకోసం సంపాదించిన దాంట్లో కొంత భాగం వృద్ధాప్యం కోసం దాచిపెడుతున్నారు. అయితే వృద్ధాప్యంలో పిల్లలతోడు లేకుంటే ఎంత నరకంగా ఉంటుందో మాత్రం ఆలోచించడం లేదు. పిల్లలనే పచ్చని చిలుకలు తోడు లేకుంటే,,, పాడే కోయిల్లాంటి మనవరాళ్లు,

మునిమనవళ్లు లేకుంటే బతుకే బాధల బందీఖానా. కన్నీళ్లతో కాపురమే శరణ్యం అనాథ మరణం. అనామక ఖననం అని గమనించి, కనువిప్పు కలిగి, మార్పుకి కళ్ళు తెరవాలి నేటి యువకెరటాలు!

అమ్మ లేదు, నాన్న లేడు, అక్క చెల్లి తంబి లేరు, ఏక్ నిరంజన్- పిల్లా లేదు పెళ్లీ లేదూ పిల్లనిచ్చి పెళ్లి చేసే మావ లేడు అని ఏక్ నిరంజన్ అని ఓ ప్రత్యేక నేపథ్యంలో అన్నాడో కవి. ఇక ఈ తరం వాలకం చూస్తుంటే - కొడుకు లేడు కూతురు లేదు కొడుకు, కూతుళ్లను పెంచి పెద్ద చేసి పెళ్లి చేసే ఏ బాధ్యతా లేదు- ఏక్ నిరంజన్, మనవళ్లు లేరు, మనవరాళ్లు లేరు ఏక్ నిరంజన్ అన్నట్టే ఉంది వ్యవహారం! అంటే ఒకప్పుడు అనాథ పిల్లలుండేవారు. ఇప్పుడు ఈ తప్పుడు విధానం వల్ల అనాథ అమ్మానాన్నలు అధిక మవుతారు. అమ్మానాన్న లేని పిల్లలు అనాథలయితే, పిల్లలే అసలొద్దనుకునేవాళ్లు అనాథలకన్నా అధ్వాన్నమేగా!! జీవితపు తొలి సంధ్యలో సంసార మకరందాన్ని తనివితీరా ఆస్వాదించిన యువ జంటలు వారి మలిసంధ్యలో మనవళ్లు, ముని మనవరాళ్లతో గడిపే క్షణాలు శాశ్వతంగా గుర్తుండిపోయే తీపి గుర్తులు ... ఈ భాగ్యానికి ఈ అభాగ్యులు దూరమే కదా !

## సంతానమే సృష్టిలో సమతౌల్యానికి మూలం

నిజానికి సంతానోత్పత్తి అనేది ప్రకృతిలో మనందరి ప్రభువయిన అల్లాహ్ నియమం. మానవులకు, భూమిపై ఉన్న ఇతర జీవులకు విశ్వవ్యాప్తంగా ఈ నియతి, నియమం వర్తిస్తుంది. సంతానోత్పత్తి లేకుండా ఏ సమాజమూ దీర్ఘకాలంలో మనుగడ సాగించజాలదు. ఆ విషయానికొస్తే, ఒకరిద్దరిని మినహాయించి దైవప్రవక్తలందరూ కుటుంబ జీవితం గడిపినవాళ్ళే. సంతాన కాంక్ష కలిగి అల్లాహ్‌ను దీనాతిదీనంగా వేడుకున్నవాళ్ళే. అలాంటిది నేటి మన యువతరం ఎటు వెళుతోంది?

**ఏమిటి, విశ్వాసుల హృదయాలు అల్లాహ్ ప్రస్తావనతో ద్రవించే సమయమింకా రాలేదా? ఆయన అవతరింపజేసిన సత్యం ముందు లొంగిపోయే వేళ ఆసన్నం కాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమైపోయాయి. ఈనాడు వారిలో చాలామంది దుర్మార్గులై ఉన్నారు. (మీరలా కాకూడదు సుమా!) (అల్-హదీద్: 16)**

## ఒక్కసారి ఆలోచించండి!

ఇంట్లో పిల్లలు ఉంటే ఎంత బాగుంటుంది! ఆఫీస్ నుంచి ఇంటికెళ్లి పిల్లలతో కాసేపు గడిపితే అప్పటివరకు పడ్డ స్ట్రెస్ అంతా మాయమవుతుంది. ఇదంతా ఒకప్పటి తరం ఆలోచన. కానీ.. ఈ జనరేషన్లో కొందరు మాత్రం పిల్లలు లేకపోవడమే మంచిది అంటున్నారు. పిల్లలు వద్దనుకుంటున్న వాళ్లలో కొందరు 'ఖర్చు ఉండదు. బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం లేదు' అంటుంటే... మరికొందరేమో పర్యావరణానికి మేలు చేస్తున్నాం' అంటున్నారు. ఒకప్పుడు పిల్లలు లేకపోవడం చెప్పుకోలేని బాధ. ఇప్పుడు పిల్లలు ఉండడమంటే భరించలేని ఖర్చు! అందుకే 'డ్యుయల్ ఇన్కం నో కిడ్స్' అనే ట్రెండ్ ఫాలో అవుతున్నారు చాలామంది దంపతులు..

పూర్వం రోజుల్లో జంటలు ఐదారుగురు పిల్లల్ని కనేవాళ్లు. తర్వాత జనాభా బాగా పెరుగుతోందని 'ఇద్దరు లేదా ముగ్గురికి ' పరిమితం అయ్యారు. ఆ తర్వాత 'ఇద్దరే చాలు' అన్నారు. కొన్నాళ్లకు 'ఇద్దరు వద్దు ఒక్కరే ముద్దు' అనే పరిస్థితులు వచ్చేశాయ్. కొన్నేండ్ల నుంచి అయితే 'వన్ ఆర్ నన్' అంటున్నారు. అదికాస్తా ఇప్పుడు 'పిల్లలే వద్దు' అయ్యింది. పలు కారణాల వల్ల పిల్లలు వద్దు అనుకునేవాళ్లను 'డింక్ కపుల్స్' అని పిలుస్తారు.

"పెళ్లయిన వెంటనే నాకు పిల్లల్ని కనడం ఇష్టంలేదు. టైం దొరికిన ప్రతిసారి లైఫ్ పార్టనర్‌తో కలిసి దేశవిదేశాలు తిరగాలని ఉంది" అని చెప్పింది ఒకామె. ఆమె చెప్పినదానికి కాబోయే భర్త కూడా రాజీ అయ్యాడు. అలా ఇద్దరూ పెళ్లి అనే బంధంతో కొత్త జీవితంలోకి అడుగు పెట్టారు. ఆ తరువాత నుంచి ఇద్దరూ ఉద్యోగానికి వెళ్తున్నారు. ఏడాదికి రెండు మూడుసార్లు ఫారిన్ ట్రిప్స్ వెళ్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇది ఓ సతి తీర్మానం.

"మనకు వచ్చే జీతంతో మనం ఇద్దరమే కంఫర్ట్‌గా ఉండగలం. పిల్లలు పుడితే వాళ్లను పెంచడానికి, పోషించడానికి చాలా డబ్బు కావాలి. ఫైనాన్షియల్‌గా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాబట్టి పిల్లలు వద్దనుకుంటే ఏ సమస్యా ఉండదు. రిటైర్మెంట్ తర్వాత ఖర్చుల కోసం ఇప్పుడు సంపాదిస్తున్న దాంట్లో కొంత పొదుపు చేసుకుంటే సరిపోతుంది"- ఇది ఓ పతి జడ్జిమెంటు. ఇక్కడ చెప్పుకున్న రెండు జంటల్లానే ఇప్పుడు చాలా జంటలు నిర్ణయం తీసుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబై లాంటి పెద్ద సిటీల్లో ఈ కల్చర్ విపరీతంగా పెరుగుతోంది.

## అయ్యో.. హతవిధీ!

చదువు తెలివి పెంచాడు చంద్రలోకము జయించాడు, నీతులు చెప్పి గోతులు తవ్వి పాతాళానికి జారాడు. మెదడే పెరిగి హృదయం తరిగి, నరుడే ఈనాడు వానరుడైనాడు. అందరి చెమట

చిందించాడు సంపద ఎంతో పెంచాడు పంపకమంటూ వచ్చేసరికి అంతా తనదే అన్నాడు. ధనమే హెచ్చి గుణమే చచ్చి నరుడే ఈనాడు వానరుడైనాడు.

### పిల్లలు వద్దు కానీ కుక్క పిల్లలు కావాలట

పిల్లలు లేకపోవడాన్ని బాధాకరంగా ఎందుకు చూడాలి? నిజానికి దాని అడ్వాంటేజ్ తీసుకోవాలి. పిల్లలు ఉండడం వల్ల వచ్చే ఆనందం కోసం వాళ్లు మరో మార్గాన్ని ఎంచుకుంటారు. రక్త మాంసాలున్న మనిషి పిల్లల్ని ఏమన్నా వీరు పట్టించుకోరుగానీ, కుక్క పిల్లల్ని ఏమైనా అంటే మాత్రం ఎక్కడ లేని పనికిమాలిన పౌరుషం పుట్టుకొచ్చేస్తుంది. వీరి జంతు ప్రేమ తగలెయ్యా! అందుకే వీళ్లలో ఎక్కువమంది పిల్లలకు బదులు కుక్క పిల్లల్ని పెంచుకుంటారు. వాటినే పిల్లల్లా చూసుకుంటారు. ఆహా! ఏమి ఔదార్యము?

**కొత్త జంటలు** : చాలామంది పెండ్లి జరిగిన కొన్నేండ్ల వరకు పిల్లల్ని కనకూడదు అనుకుంటున్నారు ఈ మధ్య. ఇద్దరూ పనిచేస్తున్నా భవిష్యత్తు అవసరాల కోసం కొంత డబ్బు దాచుకున్నాకే పిల్లల్ని కనాలి అనుకుంటున్నారు. అలాంటివాళ్లు ఈ దశలో ఇల్లు, కారు కొనడం లాంటివి చేస్తుంటారు. లేదంటే.. పెండ్లి కోసం చేసిన అప్పులు తీరుస్తుంటారు. కాబట్టి పిల్లల్ని పెంచేందుకు సిద్ధంగా ఉండరు.

"మీ ప్రభువు మీపై ఎలాంటి ఆంక్షలు విధించాడో తెలుపనా" అని వారికిలా చెప్పు: ఆయనకు ఎవరినీ సాటి కల్పించకూడదు. తల్లిదండ్రుల పట్ల సద్భావనతో మసలుకోవాలి. దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము, వారికీ ఇస్తాము.

(అల్-అన్ఆమ్: 151)

**(మిగతా వచ్చేవారం)**

# రమజాన్‌కు వీడ్కోలు

వేయి కళ్ళతో ఎదురు చూసిన రమజాన్ మాసం, మన ఇంటికి స్వాగతం పలికిన రమజాన్ మాసం, ప్రేమా ఆప్యాయతలు పంచి, ఇంటిని ఆనందమయం చేసి మరి కొద్ది రోజుల్లో మన నుండి వీడ్కోలు తీసుకోవడానికి సిద్ధమైంది.


క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు ఎంతో వేగంగా గడిచిపోయాయి. ఎన్నో వరాల మూటలు మోసుకొచ్చే రమజాన్ మాసం మన నుండి సెలవు తీసుకోవడానికి సిద్ధమైంది. మిగతా 11 నెలలు ఎలా ఉండాలో నేర్పించి వెళు తుంది. రమజాన్ మాసం మనకు ఎన్నో విషయాలను నేర్పిస్తుంది. మనిషి క్రమశిక్షణగా ఉండాలని, దానధర్మాలు చేయాలని, దయాగుణం కలిగి ఉండాలని తెలియజేస్తుంది.

ముస్లింలు, ముస్లిమేతరులు అన్న భేదభావం లేకుండా సమాజంలోని పేదసాదల పట్ల ధనవంతులు తమ బాధ్యతను గుర్తించుకోవాల్సిన అవసరం రమజాన్ గుర్తు చేస్తుంది. అనవసర భోగ విలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. కఠినంగా మారిన మన హృదయాలలో దైవభీతిని కలిగించిన రమజాన్ మాసం మనకు వీడ్కోలు పలకడానికి సిద్ధమైంది.

రమజాన్ రాకతో మలినమై ఉన్న మనసులు శుభ్రం అయ్యాయి. శుభదాయకమైన రమజాన్ మాసాన్ని పొంది కూడా పాపమన్నింపు చేయించుకోకుండా, అల్లాహ్ ప్రసన్నత పొందని వ్యక్తిని దైవదూత జిబ్రయీల్ శపించగా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం 'ఆమీన్' అన్నారు. రమజాన్ ముగిసిన తర్వాత కూడా రమజాన్ నెల ఇచ్చిన శిక్షణను, దైవభీతిని విడిచి పెట్టకూడదు. ఏ చెడుల నుండి మనం దూరంగా ఉన్నామో అదేవిధంగా మన జీవితంలోని ప్రతీ క్షణం, ప్రతీ రోజూ కూడా రమజాన్ నెలలో ఏ విధంగా అయితే భయ-భక్తులతో గడిపామో అదేవిధంగా గడపాలి.

మళ్ళీ ఇలాంటి రమజాన్ పండగలెన్నో రావాలని, మన ఇంటిని ఆనందమయం చేయాలని ఆ ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను వేడుకుందాం!

**- ఎం.ఏ ఆరిఫ్, కొత్తగూడెం**




# తెలుగు భాషలో ఖుర్‌ఆన్ అనువాదాలు

**- ముహమ్మద్ అజ్గర్ అలీ**

అరబీ భాషలో ముహమ్మద్(స) ప్రవక్త ద్వారా అల్లాహ్ మానవాళికి పంపిన చిట్టచివరి పవిత్ర గ్రంథం ఖుర్‌ఆన్. ఖుర్‌ఆన్ గ్రంథం మహాప్రవక్త ముహమ్మద్(స)పై రమజాను మాసంలో అవతరించటం మొదలైంది. దాదాపు ఇరవై మూడు సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఈ గ్రంథం మానవుల అవసరాలకు పరిస్థితులకు అనుగుణంగా సందేశాలను మోసుకొచ్చింది. తెలుగు భాషలో ఖుర్‌ఆన్ అనువాదాలు చూద్దాం-

1. 1925-చిలుకూరి నారాయణ రావు అనువదించిన **'ఖురాన్ షరీఫ్'**, మద్రాసు

2. 1941-ముహమ్మద్ ఖాసిం ఖాన్ **ఖురాన్ షరీఫ్** 9 సూరాలు. హైదరాబాద్

3. 1948-మున్షీ మౌల్వీ ముహమ్మద్ అబ్దుల్ గఫూర్, **కురానె మజీద్,** కర్నూలు (వ్యాఖ్యాన సహితం)

4. 1981- షేక్ హమీదుల్లా షరీఫ్, **దివ్య ఖుర్‌ఆన్** 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్' ప్రచురణ హైదరాబాద్

5. 2004- అబుల్ ఇర్ఫాన్, **"ఖురాన్ భావామృతం"**, హైదరాబాద్ (ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్)

6. 2007-యస్.ఎం.మలిక్, **'ఖుర్‌ఆన్ అవగాహనం'** (10 సంపుటాలు) అబుల్ ఆలా మౌదూదీ వ్యాఖ్యానం (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్)

7. 2008-డాక్టర్ అబ్దుల్ రహీమ్ బిన్ ముహమ్మద్ మౌలానా, సౌదీ అరేబియా **(ఖుర్‌ఆన్ సందేశం)**

8. 2009-ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, **'అంతిమ దైవగ్రంథం ఖుర్‌ఆన్'** 1902 పేజీలు (మౌలానా ముహమ్మద్ జునాగడీ) గారి అహ్‌సనుల్ బయాన్, శాంతిమార్గం పబ్లికేషన్స్ హైదరాబాదు

9. 2010-అబ్దుల్ జలీల్, **పవిత్ర ఖుర్‌ఆన్,** దారుల్ ఫుర్ ఖాన్, విజయవాడ, 862 పేజీలు.

10 2012- డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ సత్తార్, **జియావుల్ ఖురాన్,** (అల్లాహ్ అంతిమ ఆకాశ పరిశుద్ధ గ్రంధము), విశాఖపట్టణం. 1100 పేజీలు.

11. 2012- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, **'అల్ ఖురానుల్ ముబీన్'** 'మౌలానా హాఫిజ్ ఖ్వారీ ఫహీముద్దీన్ అహ్మద్ సిద్దీఖీ, హుదా డిస్ట్రిబ్యూటర్స్, హైదరాబాద్ 552 పేజీలు.

12. ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ -**'దివ్యగ్రంథం ఖుర్‌ఆన్'**- 640 పేజీలు, మౌలానా వహీదుద్దీన్ ఖాన్, గుడ్‌వర్డ్ పబ్లిషర్స్.

13. ముహమ్మద్ అజీజుర్రహ్మాన్- **"ఖుర్‌ఆన్ భావ మాధుర్యం"** మౌలానా ఖాలిద్ సైఫుల్లాహ్ రహ్మానీ గారి "ఆసాన్ తఫ్సీర్ ఖుర్‌ఆన్ మజీద్"- అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్ కడప, ఆం.ప్ర.

14. కె.ఎం.ఎ సుబ్‌హాన్ **"ఖుర్‌ఆన్ ఛత్రఛాయలో"** (ఫీ జిలాలిల్ ఖుర్‌ఆన్) అరబీ మూలం : సయ్యిద్ ఖుత్బ్ షహీద్, ఉర్దూ అనువాదం : సయ్యిద్ హామిద్ అలీ. తెలుగు ప్రచురణ : సామాజిక అధ్యయన వేదిక, నెల్లూరు.

15. 2024- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్- **"ఖుర్‌ఆన్ ఉపదేశం"** 1936 పేజీలు. మౌలానా వహీదుద్దీన్ ఖాన్ తఫ్సీర్ 'తజ్‌కీరుల్ ఖుర్‌ఆన్', గుడ్‌వర్డ్ పబ్లిషర్స్, న్యూఢిల్లీ.

16. ముహమ్మద్ అజీజుర్రహ్మాన్- **"ఖుర్‌ఆన్ మకరందం"** మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి తఫ్సీర్ "తదబ్బురె ఖుర్‌ఆన్" 9వ సంపుటం- అతి త్వరలో....

❖




# మహమ్మారిలా మారిన డ్రగ్స్

సమీనా సలీమ్

**రూ. కోటి రెండున్నర లక్షల గంజాయి పట్టివేత..**

సెప్టిక్ ట్యాంక్ వాహనంలో తరలి వెళ్తున్న గంజాయిని పటాన్ చెరువు తెల్లాపూర్ ప్రాంతంలో స్వాధీనం.

అనుమానం రాకుండా సెప్టిక్ ట్యాంక్ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్న డిటిఎఫ్ పోలీసులు.

సెప్టిక్ ట్యాంక్ వాహనంతో పాటు ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.

మనం కలలు కన్న తెలంగాణ అవతరించిన తర్వాత బంగారు తెలంగాణను చూద్దామనేలోపే మద్యం దుకాణాలు గల్లీ గల్లీలో దర్శనమిచ్చాయి. బడుల పక్కనే మద్యం ఏరులై పారుతోంది. మహిళలపై అత్యాచారాలు, దొంగతనాలు, నేరాలు పెరిగి పోతున్నాయి. అయినా మద్యం సరఫరా ఆగలేదు. ప్రభుత్వం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగానే చూస్తూ వచ్చింది. ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టింది. కేసులు పెరుగుతున్నాయని అంటున్నారే కానీ దానికి కారణభూతమైన ఈ మద్యం మత్తును ఆపటం లేదు. మద్యమే అనుకుంటే నేడు డ్రగ్స్ కల్చర్ పెరిగిపోయింది. గ్రామాలలోని యువత గంజాయికి బానిస అవుతుంది.

పిల్లలు బయటికి వెళ్తే భయం వేస్తుంది ఐదు నిమిషాలు అటుఇటు అయినా వాళ్ళు ఎవరితో ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారు? అనే భయం ప్రతి తల్లి గుండెల్లో బెంబేలెత్తిస్తోంది. తెలంగాణ అవతరించిన తర్వాత తల్లి గుండె మాత్రం ఆవేదనతోనే నిండిపోయింది. బిడ్డలు మద్యానికి ఎక్కడ బానిస అవుతారో అనే భయం మాత్రం ప్రతి తల్లి గుండెను బెంబేలెత్తిస్తుంది.

ఆన్‌లైన్‌లో కూడా డ్రగ్ సరఫరా జరుగుతుంది. ఐస్ క్రీమ్లలో

కూడా డ్రగ్స్ సరఫరా ఇలాంటి తరుణంలో పిల్లల భవిష్యత్తు ఎంత భయంకరంగా ఉంది దీన్ని అరికట్టడం ఒక్క పోలీసుల పని అంటారా లేక మన అందరి బాధ్యతనా? పోలీసుల దాకా విషయం చేరేవరకు మన పిల్లలు డ్రగ్స్‌కి బానిసలైపోతే నష్టపోయేది ముందుగా మనమే.

పిల్లల భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడపాలి. డ్రగ్స్‌లో కూరుకుపోతున్న మన పిల్లల భవిష్యత్తు కోసం ఏకమవ్వాలి. పేదవాడైనా, ధనికుడైనా, ఏ మతస్తుడైనా భవిష్యత్తు అంధకారమైపోతుంటే కాపాడవలసిన బాధ్యత మనందరిది.

"ఇప్పుడు మారుదాం... రేపటిని కాపాడుదాం!"

"ఒక్కసారి" అనుకోవద్దు - అది జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది!

స్నేహితుల ఒత్తిడికి లొంగొద్దు- నిజమైన స్నేహితుడు మిమ్మల్ని రక్షిస్తాడు, నాశనం చేయడు!

గంజాయి నుండి మనల్ని మనమే కాపాడుకోవాలి- మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుంది.

తండ్రిగా, తల్లిగా, అన్నగా, అక్కగా, స్నేహితుడిగా- నాశనానికి దారితీసే గంజాయిని ఎదిరించండి!

జీవితం అందమైనది, దాన్ని మత్తులో ముంచెయ్యకండి!

పరిష్కారం గంజాయిలో లేదు... నిజమైన ఆనందం మన కృషిలో ఉంది!

అందుకే ఏ పిల్లలైనా డ్రగ్స్‌కు అలవాటు పడితే వారిని మనము చీదరించుకోవడం కన్నా అసలు ఆ పిల్లవాడు ఆ డ్రగ్స్ ఎక్కడి నుంచి తెస్తున్నాడు అన్నది ఆరా తీయడం చాలా అవసరం. అందుకుగాను ఎవరో ఏదో చేస్తారని కాదు మన ప్రాంతంలోనే ప్రతి మహిళా ఇలాంటి విషయాలను కనుగొనడానికి ప్రయత్నించాలి. డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయో కనుక్కోవాలి. వెంటనే ఆ విషయాన్ని పోలీసులకు తెలియజేయాలి.

అంతే కాకుండా అసలు యువత ఎందుకు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు అన్న విషయాన్ని పరిశీలించాలి. ఆ మత్తు వదిలించడానికి ప్రేమ, అభిమానం, ఆప్యాయత, ఆధ్యాత్మికతల రుచి చూపించాలి.

పిల్లల చదువులు మార్కులే కాదు. మంచి సంస్కారం విధేయత వినయము అలవాట్లను అనుసరించేలా నేర్పించడం ప్రతి తల్లి బాధ్యత. ఇలాంటి మత్తులో కూరుకున్న పిల్లలకు ఒక ప్రశాంత వాతావరణం అందించాలి తల్లిదండ్రుల గొడవల్లో పిల్లలు సమిధలు కాకూడదు వాళ్లకు నేనున్నాను అని ఒక ధైర్యాన్ని అందించాలి. ప్రేమ అభిమానంతో, డ్రగ్స్ తీసుకుంటే ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో వాళ్లకు సవివరంగా వివరించాలి.

మత్తు ఈ జగత్తుని చిత్తు చేస్తుంది. భవిష్యత్తును మంట గలుపుతుంది. నీ ఆరోగ్యం, నీ భవిష్యత్తు నాశనమైతుంటే రేపటి సమాజం ఏ విధంగా ఉంటుంది అని సవివరంగా వివరించాలి. ప్రభుత్వాలు కూడా మారాలి. ప్రభుత్వం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా చూడకూడదు. పోలీసు శాఖ కూడా కఠినంగా వ్యవహరించాలి. న్యాయవ్యవస్థ దోషులకు శిక్షలు విధించాలి. నేటి సినిమాలు కూడా మత్తును ప్రేరేపించే విధంగా ఉన్నాయి.

మార్పు మనతోనే మొదలవ్వాలి యుద్ధ ప్రాతిపదికన మనందరం నిరంతర కృషి చెయ్యాలి. అందుకు ప్రజలంతా మమేకమవ్వాలి ప్రజాశక్తి ముందు మత్తు చిత్తు అవ్వాలి. బంగారు తెలంగాణ మత్తు రహిత తెలంగాణగా అవతరించాలి.


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




**షవ్వాల్** ఆరు ఉపవాస రోజాలు కేవలం సున్నత్ మాత్రమే. ఈదుల్ ఫిత్ర్ జరుపుకున్న రెండో రోజు నుంచి సాధారణంగా ఈ ఉపవాసాలను పాటిస్తారు.

### ఈ ఉపవాసాల ప్రాధాన్యత

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : ఎవరయితే రమజాన్ ఉపవాసాలు ఉండి ఆ తరువాత షవ్వాల్ మాసంలోని ఆరు ఉపవాసాలు ఉంటారో వారు యేడాదంతా ఉపవాసాలు ఉన్నారు.

(ముస్లిమ్, తిర్మిజీ, అబూదావూద్ ఇబ్నెమాజా)

రమజాన్ ఉపవాసాలతోపాటు ఎవరైతే షవ్వాల్ నెలలో ఆరురోజులపాటు ఉపవాసాలు కూడా పాటిస్తాడో అతడ్ని ఈ రోజే అతని తల్లి కన్నదా అన్నట్లు అతను పరమ పవిత్రుడయిపోతాడు. (ముస్లిమ్, అబూదావూద్)

రమజాన్ రోజాలన్నింటితోపాటు షవ్వాల్ నెలలో ఆరు రోజుల ఉపవాసాలు కూడా పాటించేవాడు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటిస్తున్న వాడవుతాడు. (ముస్లిమ్)

హజ్రత్ ముస్లిం ఖురైషీ(రజి) కథనం ప్రకారం 'సాయిముద్దహర్' (ఎల్లప్పుడూ ఉపవాసం పాటించడం) గురించి అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త(స) ఇలా జవాబిచ్చారు. "నీపై భార్యాపిల్లల హక్కు కూడా ఉంది. కనుక రమజాన్ ఉపవాసాలతోపాటు (షవ్వాల్) నెలలోని (ఆరు రోజుల) ఉపవాసాలు కూడా పాటించు. అదీగాక బుధవారం, గురువారం కూడా ఉపవాసం పాటించు. ఈ విధంగా నీవు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటించేవాడిగా పరిగణించబడతావు"

(తిర్మిజీ, అబూదావూద్)

ప్రవక్త(స) తన సముదాయానికి శుభవార్తనిచ్చారు. రమజాన్ ఉపవాసాలు ఉన్న తరువాత షవ్వాల్ ఉపవాసాలు ఉంటే వారు యేడాదిపాటు ఉపవాసాలు ఉన్నంత పుణ్యాలను పొందుతారు. అల్లాహ్ కరుణానుగ్రహాల వల్ల ఒక పుణ్యానికి కనీసం పదింతల ప్రతిఫలం లభిస్తుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా తెలిపాడు : "అల్లాహ్ వద్దకు సత్కార్యాన్ని తీసుకువచ్చే వాని కొరకు పదింతలు ప్రతిఫలం ఉంది. (అల్ అన్‌ఆమ్ 6: 160)

ఎవరయినా రమజాన్ మాసంలోని రోజాలన్నీ ఉంటే అతనికి పదినెలల పుణ్యం ప్రాప్తమవుతుంది. ఆ తరువాత షవ్వాల్‌లోని ఆరు ఉపవాసాలు ఉంటే 60 రోజుల పుణ్యం లభిస్తుంది. ఇలా అన్నీ కలిపి పన్నెండు నెలలు అంటే యేడాది ఉపవాసాలు ఉన్న పుణ్యాన్ని పొందుతారు.

ఈ ప్రాధాన్యతతోపాటు ఇంకా మత గురువులు (ఉలమాలు) ఏమంటారంటే రమజాన్ మాసంలో ఉన్న ఉపవాసాలలో ఏమయినా పొరపాట్లు జరిగి ఉన్నట్లయితే షవ్వాల్‌లోని ఈ ఆరు ఉపవాసాల వల్ల అల్లాహ్ అతని పొరపాట్లను మన్నిస్తాడు. అల్లాహ్ సున్నత్‌లు, నవాఫిల్‌ల ద్వారా ఫర్జ్ నమాజులలో ఏర్పడిన లోపాన్ని పూరిస్తాడు.

## పవిత్ర రమజాన్ తరువాత మన జీవనం

తీవ్ర ఎండాకాలంలో పవిత్ర రమజాన్ ముగిసింది. ఈ మహత్తరమైన మాసంతో మనలో ఏదైనా మార్పు వచ్చిందా లేదా ఆలోచించాలి. మార్పు రాలేదంటే ఇలాంటి రమజాన్‌లు మన జీవితంలో వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. మన మృత్యువు మనకు దగ్గరవుతూ ఉంటుంది.

మన నడవడికలో, మాట్లాడే పద్ధతిలో, ఇచ్చుపుచ్చు కోవడంలో, వ్యాపారంలో, ఉద్యోగంలో చాలా జాగ్రత్తగా ఉండడానికి ప్రయత్నం చేశాము.

పెద్దవారితో మర్యాదపూర్వకంగా ఉండటం, పిల్లలతో సంతోషంగా మెలగడం, వారికి సరైన బాటలో నడిపించడం, బంధుత్వాలను నెరవేర్చడం, ఇరుగు పొరుగు వారితో కలిసి మెలిసి ఉండటం, స్నేహితులతో మంచిగా ప్రవర్తించడం, పేదవారికి, అనాథులకు, బాటసారులకు, వితంతువులకు, ఖైదీలకు అన్ని విధాలుగా ఆదుకోవడం జరిగింది. ఆకలితో ఉన్నవారికి ఆహార పదార్థాలు, బట్టలు లేనివారికి బట్టలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి డబ్బుల ద్వారా గానీ, మందులు ఇచ్చి ఆదుకోవడం జరిగింది.

జకాత్, ఫిత్రా, సదఖా వంటి అర్హులైన వారికి ఇచ్చి కొంతైనా సహాయం చేశాం. ఐదుపూటల నమాజ్‌తోపాటు తరావీహ్ నమాజ్, తహజ్జుద్ నమాజ్‌ను స్థాపించాము. సున్నత్, నఫిల్ నమాజులను సైతం చేసి తీరాము. అంతిమ దివ్య ఖుర్ఆన్ రమజాన్ మాసంలో అవతరించబడిన గ్రంథాన్ని ఎంతో శ్రద్ధతో పఠించాము. తర్జుమాతో చదివాము. దానిని అర్థం చేసుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేశాము. ఇతరులకు చేరడానికి కృషి చేశాము.

సెల్‌ఫోన్, టెలివిజన్, ఇంటర్నెట్, పలికిమాలిన మాటలతో, చెడు అలవాట్లు అన్నీ వదిలి దైవారాధనలో ఎక్కువ సమయాన్ని కేటాయించి అల్లాహ్ మెప్పు పొందడానికి శత విధాలుగా ప్రయత్నం చేయడం జరిగింది.

దివ్య ఖుర్ఆన్ గ్రంథంతోపాటు హదీసు గ్రంథాలు, దైవప్రవక్త జీవిత పుస్తకాలు చదివాము. లైలతుల్ ఖద్ర్ కోసం (మహోన్నతమైన రాత్రి) బేసి రాత్రులలో అన్వేషించాము.

దానధర్మాలు చేసి ఈదుల్ ఫిత్ర్ నాడు సంతోషంగా, ఆనందంగా, ఉల్లాసంగా, కొత్త బట్టలు ధరించి ఈద్గాలో లేదా పెద్ద మసీదులో నమాజును స్థాపించాము.

బంధువులను, ఇరుగు పొరుగు వారికి, మిత్రులను, ముస్లిమేతరులను ఇంటికి పిలిపించి షీర్ ఖుర్మాను అందించాము. సమాజంలో మంచి వాతావరణాన్ని కలిగించాము.

రమజాన్ మాసం ఆధ్యాత్మిక జీవన సరళికి ఇది ఒక రీచార్జింగ్ బ్యాటరీ వంటిది. దీనివల్ల రాబోయే సంవత్సరానికి అవసరమయ్యే ఆధ్యాత్మిక శక్తి రీచార్జి అవుతుంది. ఒక ఆదర్శప్రాయమైన జీవన విధానాన్ని, చక్కని క్రమశిక్షణా విధానాన్ని రమజాన్ మాసంలోకాక మరే మాసంలో పొందగలం?

మన దురలవాట్లను, మన దుష్ప్రవర్తనలను, అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగా చేసే పనులను మార్పు చేసుకునేందుకు ప్రత్యేకించబడిన మాసం రమజాన్ మాసం.

ఒక ముస్లిం ఎడతెగకుండా అల్లాహ్ దాస్యంలోనే నిమగ్నమవ్వాలి. అల్లాహ్ ఆయన ప్రవక్త(స) సూత్రాలను స్థిరంగా అనుసరిస్తూ మరణపు చివరి ఘడియ ఆసన్నమైనంత వరకూ అనుసరిస్తూ ఉండాలి.






## విద్యా సంస్థల్లో ర్యాగింగ్ భూతానికి 51 మంది బలి

దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ భూతానికి 2022-24 మధ్య కాలంలో 51 మంది బలైపోయారు. పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలతో ఈ సంఖ్య దాదాపు సమానం. సొసైటీ ఎగెనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రచురించిన 'భారత దేశంలో ర్యాగింగ్ పరిస్థితి, 2022-24' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ర్యాగింగ్ ఘటనలపై ఫిర్యాదులు అత్యధికంగా వైద్య కళాశాలల నుంచి వస్తున్నాయని తెలిపింది. జాతీయ యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు 1,946 కళాశాలల నుంచి 3,156 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 38.6 శాతం వైద్య కళాశాలల నుంచి వచ్చాయి. ఈ ఫిర్యాదులు కేవలం హెల్ప్‌లైన్ ద్వారా నమోదైనవేనని, నేరుగా కళాశాలలు, పోలీసులకు బాధితులు చేసిన ఫిర్యాదులు ఇంకా ఎక్కువే ఉంటాయని ఈ నివేదిక రూపకర్తలు తెలిపారు. 2022-24 మధ్య రాజస్థాన్‌లోని కోటాలో 57 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాలలు యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ నివేదిక సూచించింది. ఈ స్క్వాడ్‌ను సంప్రదించేందుకు ఫోన్ నంబరు తదితర వివరాలను కొత్త విద్యార్థులకు తెలియజేయాలని పేర్కొంది.

## విద్యార్థుల ఆత్మహత్యలపై జాతీయ టాస్క్‌ఫోర్స్

ఉన్నత విద్యా సంస్థలలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలపై సుప్రీంకోర్టు ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళలను పరిష్కరించడానికి ఓ జాతీయ టాస్క్‌ఫోర్సు (ఎన్‌టీఎఫ్)ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.ఐఐటీ, ఢిల్లీలో చదువుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ ఎన్‌టీఎఫ్ చైరపర్సన్‌గా ఉంటారని, రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ, సామాజిక న్యాయ, న్యాయ వ్యవహారాలు, సాధికారత, మహిళా, శిశు అభివృద్ధి శాఖల కార్యదర్శులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. ఆత్మహత్యలకు దారితీస్తున్న కారణాలపై సమగ్ర నివేదికను అందజేయాల్సి ఉంటుందని తెలిపింది.

## నిందితుల ఇళ్ల కూల్చివేత రాజ్యాంగంపై బుల్డోజర్ నడపడమే

'బుల్డోజర్ న్యాయాన్ని' సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడమంటే చట్టబద్ధమైన పాలనను కాదనడమేనని అన్నారు. ఇది రాజ్యాంగంపై బుల్డోజర్‌ను నడిపించడం లాంటిదేనని వ్యాఖ్యానించారు. భారతి విద్యాపీఠ్ న్యూ లా కాలేజీలో జరిగిన 13వ పి.ఎన్.భగవతి అంతర్జాతీయ మూట్ కోర్టు పోటీల్లో ఆయన ప్రసంగించారు. మొదట ఇల్లును కూల్చివేసి, అనంతరం దాన్ని అక్రమ కట్టడమని చెప్పి సమర్థించుకోవడం ఆందోళనకరమని చెప్పారు.

## వక్ఫ్ బిల్లు.. రాజ్యాంగంపై దాడి!

కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యాంగంపై దాడిగా కాంగ్రెస్ పేర్కొంది. శతాబ్దాల కాలం నుంచి బలంగా ఉన్న మన దేశ బహుళ మత సమాజ సామరస్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ నిరంతరంగా చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా దీన్ని తీసుకొచ్చారని ఆరోపించింది. తప్పుడు ప్రచారం చేయడం, దురభిప్రాయాలను సృష్టించడం ద్వారా మైనారిటీ వర్గాలను బూచిగా చూపేందుకు బీజేపీ యత్నిస్తోందని విమర్శించింది. వక్ఫ్ బిల్లు పూర్తిగా లోపభూయిష్టమని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్‌లను నిర్వహించేందుకు గత చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన సంస్థల స్థాయి, అధికారాన్ని తగ్గించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ ప్రయోజనాల కోసం భూమిని ఎవరు దానం చేయవచ్చో నిర్ణయించడంపై ఉద్దేశపూర్వకంగా అస్పష్టత ఇచ్చారని, వక్ఫ్ నిర్వచనాన్నే మార్చారని రమేశ్ ఆరోపించారు. వక్ఫ్ పాలనను బలహీనం చేసేందుకు ప్రస్తుతం ఉన్నచట్టంలోని నిబంధనలు తొలగించారని, వక్ఫ్ భూములను అక్రమించిన వారికి రక్షణ కల్పించేలా మార్పులు చేశారని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులపై వివాదాలు, వాటి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశాలపై కలెక్టర్లు, నియమించిన ఇతర రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విశేష అధికారాలు కల్పించడాన్ని ఆయన తప్పుబట్టారు.




## 50 వేలు దాటిన పాలస్తీనా మృతుల సంఖ్య

ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడుల్లో 26 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హమాస్ సీనియర్ రాజకీయ నేత సలా బర్దావిల్, ఆయన భార్య కూడా ఉన్నారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 50 వేలకు చేరింది. హమాస్ బందీలుగా చేసుకున్న వారిని విడిచిపెట్టకపోతే దాడులు మరింత ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తాజాగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు రఫా పట్టణంలోకి దూసుకుపోయాయి.

## ఫిన్లాండ్.. సంతోషాలకు చిరునామా

సంతోషాలకు చిరునామా ఫిన్లాండ్.. అని మరోసారి స్పష్టమైంది. ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఎనిమిదోసారి అగ్రస్థానం దక్కించుకుంది. 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం' (మార్చి 20) సందర్భంగా విడుదల చేసిన 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ 2025'లో ఫిన్లాండ్ మరోసారి నంబర్‌వన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 147 దేశాలను ఈ సర్వేలో భాగస్వామ్యం చేయగా.. గతేడాది 126వ స్థానంలో ఉన్న భారత్ ఎనిమిది ర్యాంకులు మెరుగుపడి 118వ స్థానానికి చేరుకుంది. కానీ.. నేపాల్ (92), పాలస్తీనా (108), పాకిస్థాన్ (109), ఉక్రెయిన్ (111) కంటే భారత్ వెనకబడడం గమనార్హం. ఈ జాబితాలో అఫ్ఘానిస్థాన్ 147వ ర్యాంకుతో అట్టడుగున నిలిచింది. ఈ జాబితాలో మన పొరుగున ఉన్న దేశాలైన శ్రీలంక 133, బంగ్లాదేశ్ 134, చైనా 68వ స్థానాల్లో నిలిచాయి. పాశ్చాత్య దేశాల్లో ముఖ్యంగా ఐరోపా దేశాలు టాప్-20లో ఆధిపత్యం చలాయించాయి. అమెరికా 24వ స్థానానికి, బ్రిటన్ 23వ స్థానానికి పడిపోయాయి.

## గోల్డ్ కార్డుల కోసం క్యూ

అమెరికాలో శాశ్వత నివాసం కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డ్ (గోల్డెన్ వీసా)లకు మంచి ఆదరణ లభిస్తోందని వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లట్నిక్ తెలిపారు. ఎవరైనా అయిదు మిలియన్ డాలర్లు (సుమారు రూ.43 కోట్లు) చెల్లించి అమెరికాలో శాశ్వతంగా నివాసం ఉండొచ్చు. అమెరికా పౌరసత్వం తీసుకోవాలా, వద్దా అన్నది వారి ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. శాశ్వత పౌరసత్వం తీసుకున్నా మధ్యలో రద్దు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఈ గోల్డెన్ వీసా పొందడానికి చాలా మంది లైనులో ఉన్నారని లట్నిక్ చెప్పారు. కేవలం ఒక్క రోజులోనే 1,000 కార్డులు విక్రయించామని తెలిపారు. ఈ పథకాన్ని రెండు వారాల్లో అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను ఎలాన్ మస్క్ రూపొందిస్తున్నారని తెలిపారు.

## కెనడాలో మధ్యంతర ఎన్నికలు.

మధ్యంతర ఎన్నికలకు నూతన ప్రధాని మార్క్ కార్నీ పిలుపునిచ్చారు. వచ్చేనెల 28న మొత్తం 343 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కెనడాపై విధిస్తున్న సుంకాల అంశమే ఈ సారి ఎన్నికల ప్రచారంలో కీలకం కానుంది. ఎన్నికల ప్రకటన వెలువడగానే ప్రధాని కార్నీతోపాటు ప్రతిపక్ష కన్జర్వేటివ్ నేత పియరీ పోలీవర్ ప్రచారం ప్రారంభించారు. దాదాపు 37 రోజుల పాటు ప్రచారం జరుగనుంది. తొమ్మిదేండ్లపాటు దేశాన్ని పాలించిన జస్టిన్ ట్రుడో స్థానంలో కొత్త ప్రధానిగా ఈ నెల 14న కార్నీ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ట్రంప్ విధిస్తున్న సుంకాల అంశాన్నే తొలి రోజు ఎన్నికల ప్రచారంలో లేవనెత్తారు. కెనడా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు.

## మోదీ ఎవరో తెలీదు.. 70 శాతం మంది అమెరికన్ల అభిప్రాయం ఇదే!

మెజారిటీ అమెరికన్లకు మోదీ ఎవరో తెలియదట! భారత ప్రధాని ఎవరో తెలియదని 70 శాతం మంది అమెరికన్లు తెలిపారు. యూగవ్ తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. మరో సర్వేలో మోదీపై అభిప్రాయాలను అడిగారు. కేవలం 2 శాతం మంది మాత్రమే ఆయన పట్ల బలమైన ఇష్టాన్ని వెల్లడించారు. 11 శాతం మంది కొంత వరకు సానుకూలత ప్రకటించారు. మంగోల్ సామ్రాజ్య స్థాపకుడు చెంఘిజ్ ఖాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల కన్నా మోదీకి తక్కువ ర్యాంకు ఇచ్చారు. మహాత్మా గాంధీ పట్ల 61 శాతం మంది సానుకూలతను వ్యక్తం చేశారు. ఆయన మంచి నాయకుడని చెప్పారు. దీంతో ఆయనకు టాప్ 10లో చోటు లభించింది. మోదీ నెట్ ఫేవరబిలిటీ మైనస్ 3 లభించింది.

# మానవాళికి మార్గదర్శక గ్రంథం

నుస్రత్ ఫాతిమా

**దివ్య ఖుర్ఆన్ దైవ గ్రంథం.** ఇది నిజమన్న వాస్తవాన్ని ఈ దైవ గ్రంథాన్ని ప్రజలకు పరిచయం చేసిన ప్రవక్త(స) జీవిత చరిత్ర చాటి చెబుతుంది. దివ్య ఖుర్ఆన్ క్రోడీకరణ, క్రమబద్ధత, అనుపమానమైన శబ్ద సౌందర్యం, అసాధారణమైన శైలి ఎవరినైనా ఆకట్టుకుంటాయి. జ్ఞాన విజ్ఞానాల పరంగా అద్వితీయత, సంస్కరణల పరంగా అసమాన ప్రత్యేకత, మానవ సమస్యల పరిష్కారం విషయంలో సాటిలేని వివేకం, శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన ప్రస్తావనలు, అవాక్కయ్యేలా చేసే కళాత్మక సౌందర్యం, సాహిత్య శోభ, మానవ ప్రవృత్తి, విశ్వ వ్యవస్థలతో ఉన్న అద్భుతమైన పొందిక, మనిషికి ఎదురయ్యే కష్టతరమైన ప్రశ్నలకు సముచితమైన జవాబులందించే విశిష్టత ఈ గ్రంథానికి ఉన్నాయి. ఇవన్నీ పరిశీలిస్తే, ఇది దైవ గ్రంథమని స్పష్ట మవుతుంది. దివ్య ఖుర్ఆన్ ఏదో ఒక ప్రత్యేక జాతికి లేదా ప్రాంతానికి పరిమితమైంది కాదు. అది మానవాళికి మార్గదర్శకంగా నిలవడానికి అవతరించిన గ్రంథం. ఇందులోని వాక్యాలను తనలో జీర్ణించుకున్నవాడు జీవితంలోని ప్రతి సందర్భంలోను జ్ఞానంతో వ్యవహరిస్తాడు. దివ్య ఖుర్ఆన్ మనిషిని భ్రమల్లో ఉండనీయదు. మనకు స్పష్టమైన హెచ్చరికలు వినిపిస్తుంది. తప్పులు చేస్తే, తప్పు మార్గాన నడిస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో ఖచ్చితంగా హెచ్చరిస్తుంది. మనిషి ఆత్మ ప్రక్షాళన చేసుకోవడానికి అద్భుతమైన సాధనం... దివ్య ఖుర్ఆన్. అందుకే ఈ గ్రంథం అందించే సందేశాన్ని ఆచరించి జీవితాన్ని ధన్యం చేసుకోవాలి.

ఎన్ని అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా దివ్య ఖుర్ఆన్ సందేశాన్ని ఇతరులకు చేరవేయాలి. ఒక ప్రత్యేక విషయం గురించి దివ్య ఖుర్ఆన్ ఏం చెబుతుందో తెలుసుకోవాలనుకుంటే ఆ విషయానికి సంబంధించి అందుబాటులో ఉన్న రచనలను ముందుగా చదవాలి. దివ్య ఖుర్ఆన్‌కు గొప్ప వివరణ స్వయంగా ఆ గ్రంథమే. ప్రతి ఇంట్లో దివ్య ఖుర్ఆన్ నేర్చుకునే ఏర్పాట్లు ఉండాలి. ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తి ఈ బాధ్యత తీసుకుంటే, మొత్తం కుటుంబంలో దివ్య ఖుర్ఆన్ బోధనలు వ్యాపిస్తాయి. అరబ్బీలో దివ్య ఖుర్ఆన్ చదవడాన్ని అందరికీ నేర్పించాలి. మన ఇళ్ళల్లో పెద్దలు, పిల్లల మధ్య, ఇంటి బయట స్నేహితుల మధ్య చర్చల్లో దివ్య ఖుర్ఆన్‌లోని వివిధ అంశాల ప్రస్తావనలు ప్రముఖంగా ఉండాలి. దివ్య ఖుర్ఆన్ ముస్లింలకే కాకుండా మొత్తం మానవాళికి మార్గదర్శకత్వం. కాబట్టి ముస్లిమేతరులూ ఈ దివ్య గ్రంథాన్ని అధ్యయనం చేసి ఆధ్యాత్మిక వికాసం పొందవచ్చు.

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**